# ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



# పెద్దపల్లి
జిల్లా వార్తలు

5★

శుక్రవారం 9 మే 2025


## నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

పెద్దపల్లి రూరల్, మే 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రాగినేడు విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని బ్రాహ్మణపల్లి, అందుగులపల్లి, కుర్మపల్లి గ్రామాల్లో శుక్రవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని విద్యుత్ శాఖ ఏఈ రవిచంద్ర గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 7 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు 11 కేవీ ఫీడర్‌లో చెట్ల కొమ్మలు తొలగిస్తున్నందున విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

## లైసెన్స్ సర్వేయర్ల శిక్షణకు దరఖాస్తులు

పెద్దపల్లిటౌన్, మే 8 (ఆంధ్రజ్యోతి): లైసెన్స్ సర్వేయర్ల శిక్షణకు ఈనెల 17 లోపు దరఖాస్తు చేసుకోవాలని కలెక్టర్ కోయ శ్రీహర్ష గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. లైసెన్స్ సర్వేయర్ల శిక్షణకు అర్హత గల అభ్యర్థుల నుంచి తెలంగాణ అకాడమీ ఆఫ్ ల్యాండ్ ఇన్ఫర్మేషన్ అండ్ మేనేజ్మెంట్ దరఖాస్తులు ఆహ్వానిస్తుందని, ఈనెల 5 నుంచి మీ సేవా కేంద్రాలలో వంద రూపాయలు చెల్లించి దరఖాస్తు, ప్రాస్పెక్టస్ పొందవచ్చన్నారు. మీసేవ కేంద్రాల్లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

## టీఏల సంఘం జిల్లా కార్యవర్గం

పెద్దపల్లి టౌన్, మే 8 (ఆంధ్రజ్యోతి): ఉపాధిహామీ సాంకేతిక సహాయకుల (టీఏ) సంఘం జిల్లా కార్యవర్గాన్ని గురువారం కలెక్టరేట్ ఆవరణలో ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా బి.వెంకటేశం గౌడ్, ఉపాధ్యక్షులుగా ఓంకార్, భూలక్ష్మి, ప్రధాన కార్యదర్శిగా ఆది శ్రీనివాస్, కోశాధికారిగా కుమార్, ఈసి మెంబర్లుగా సమ్మన్న, జనార్దన్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కార్యవర్గాన్ని పలువురు టెక్నికల్ అసిస్టెంట్లు అభినందించారు.

ధాన్యం కొనుగోళ్లలో జాప్యంతో అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. ధాన్యాన్ని విక్రయించేందుకు అన్నదాతలు అరిగోస పడుతున్నారు. వాతావరణ మార్పులతో రైతులు ఆందోళన చెందుతున్నారు. పొద్దంతా ఎండగా ఉండి సాయంత్రం ఈదురుగాలులు, వర్షం పడడంతో ధాన్యం తడవకుండా ఉండేందుకు రైతులు ఇబ్బందులు పడుతున్నారు. దీంతో రైతులకు కంటి మీద కునుకులేకుండా పోయిందని వాపోతున్నారు. యాసంగిలో వరి పండించడం కన్నా ధాన్యాన్ని అమ్ముకోవడానికే ఎక్కువ శ్రమ పడాల్సి వస్తుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



జయ్యారంలో పేరుకు పోయిన ధాన్యం కుప్పలు

# కొనుగోళ్లలో జాప్యం.. పేరుకుపోతున్న ధాన్యం

- పట్టించుకోని అధికారులు
- ధాన్యం తరలింపులోనూ లారీల కొరత
- వాతావరణ మార్పులతో అన్నదాతల ఆందోళన

ఓదెల/పాలకుర్తి, మే 8 (ఆంధ్రజ్యోతి): ఓదెలతో పాటు మండలంలోని ధాన్యం కొనుగోలు కేంద్రాలకు లారీల కొరత రైతులను బాధిస్తోంది. కొనుగోలు కేంద్రాలు ప్రారంభమై నెల రోజులు దాటినప్పటికీ నేటికి ఆశించిన మేరకు కొనుగోలు, రవాణా సక్రమంగా కొనసాగడం లేదు. కేంద్రాల నిర్వాహకులు అధికారులకు, మిల్లర్లకు ఇక్కడి పరిస్థితిని ఫోన్‌లో తెలిపినా ఎలాంటి స్పందన రావడం లేదు. మండలంలోని 11 ఐకేపి కొనుగోలు కేంద్రాల్లో సన్నరకం ధాన్యం బుధవారం నాటికి 4105.20 క్వింటాళ్లు, అలాగే దొడ్డు రకం 3869.40 క్వింటాళ్లు కొనుగోలు చేశారు. అయినప్పటికీ మిల్లులకు ధాన్యం రవాణా లేకపోవడంతో ఎక్కడికక్కడే ధాన్యం నిల్వలు పేరుకుపోయాయి. అలాగే మరో 20 వేల క్వింటాళ్ల వరకు తూకం వేసినవి, వేయనివి అలాగే ఉన్నాయి. మండల వ్యాప్తంగా వెయ్యి లారీలైతే గాని ధాన్యం మిల్లులకు చేరుకునే పరిస్థితి లేదు. సొసైటీ కొనుగోలు కేంద్రాల్లో కూడా ఇదే పరిస్థితి నెలకొంది. కేంద్రాల్లో లారీలు, హమాలీల కొరత తీవ్రంగా ఉండడంతో ధాన్యం బస్తాల లోడింగ్ చేయడంలో తీవ్రమైన జాప్యం జరుగుతోంది. ఐదు రోజుల క్రితం తూకం పూర్తయి లోడింగ్ కోసం వేచి ఉన్న బస్తాలు అలాగే మిగిలిపోయాయి. వాతావరణ మార్పులతో వర్షాల భయం రైతులను ఆందోళనకు గురి చేస్తోంది.



ఓదెల కొనుగోలు కేంద్రంలో పేరుకుపోయిన ధాన్యం నిల్వలు

ఒక పక్క కేంద్రాల్లో పోసిన ధాన్యం తూకం వేయక, మరోపక్క వ్యవసాయ పనులకు రైతులు వెళ్ల లేక సతమతమయ్యే పరిస్థితి నెలకొంది. ఉన్నతాధికారులు స్పందించి ధాన్యం తూకం పూర్తి చేయించి, లారీల కొరత లేకుండా చర్యలు తీసుకోవాలని మండల రైతులు కోరుతున్నారు.

పాలకుర్తి మండలంలో కన్నాల, బామ్లా నాయక్ తండా, జీడినగర్, రాణాపూర్, ఎల్కలపల్లి, పాలకుర్తి, కొత్తపల్లి, బసంత్ నగర్‌లో ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశారు. వీటిలో ఇప్పటివరకు 37, 600 క్వింటాళ్ల ధాన్యం కొనుగోలు చేయగా 44,000 క్వింటాళ్ల ధాన్యం నిలువ ఉంది. అలాగే రామగుండం మార్కెట్ కమిటీ ఆధ్వర్యంలో మండలంలో జయ్యారం, గుడిపెల్లి, పుట్నూర్, ఈసాలతక్కళ్లపల్లి, కుక్కలగూడూర్ ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటుచేశారు. వీటిలో ఇప్పటి వరకు 26,600 ధాన్యం కొనుగోలు చేయగా మరో 24,600 క్వింటాళ్ల ధాన్యం నిలువలు పేరుకుపోయాయి.

కొనుగోళు కేంద్రాల్లో రోజుల తరబడి నిరీక్షించాల్సిన పరిస్థితి నెలకొంటుందని రైతులు ఆవేదన చెందుతున్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజా ప్రతినిధులు చొరవ చూపి త్వరగా కొనుగోళ్ళు పూర్తి చేయాలని మండల రైతులు కోరుతున్నారు..

**కంటి నిండ కునుకు ఉంటలేదు**

**ఆసంశెట్టి రామయ్య, రైతు, ఓదెల**

ఇక్కడి కొనుగోలు కేంద్రంలో పోసిన ధాన్యం తూకం వేయడం లేదు. అడిగితే లారీలు లేవు అంటున్నారు. కొద్ది రోజుల్లో వ్యవసాయ పనులు మొదలవుతాయి.

మిగతా 8వ పేజీలో

## భద్రత వ్యవస్థలను కట్టుదిట్టం చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న సీపీ అంబర్ కిశోర్ ఝా

కోల్‌సిటీ, మే 8(ఆంధ్రజ్యోతి): ఆపరేషన్ సింధూర్ నేపథ్యంలో భద్రత వ్యవస్థలను కట్టుదిట్టం చేయాలని రామగుండం సీపీ అంబర్ కిశోర్ ఝా అన్నారు. గురువారం పెద్దపల్లి, మంచిర్యాల జిల్లాల పరిధిలోని సింగరేణి, ఎన్‌టీపీసీ, ఆర్ఎఫ్‌సీఎల్‌తోపాటు ప్రభుత్వరంగ సంస్థల అధికారులతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. కమిషరేట్‌లో నిర్వహించిన సమావేశానికి డీసీపీలు, ఏసీపీలు పాల్గొన్నారు. సీపీ మాట్లాడుతూ ప్రజలకు భద్రతపై అవగాహన కల్పించడంతోపాటు ప్రభుత్వరంగ సంస్థల ప్రాంతాల్లో అప్రమత్తంగా ఉంటూ భద్రత వ్యవస్థను కట్టుదిట్టం చేయాలని ఆదేశించారు. అన్ని శాఖల యంత్రాంగం సమన్వయం చేసుకుంటూ ఇండస్ట్రియల్ సంస్థల వద్ద భద్రతను పెంచాలని, అత్యవసర సర్వీసులు అందించే విభాగాలు, ఉద్యోగులు ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని సూచించారు. కమిషనరేట్ పరిధిలో ఎక్కడా అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా నిరోధించడానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. డీసీపీలు కరుణాకర్, భాస్కర్, అడిషనల్ డీసీపీ(అడ్మిన్) రాజు, సీఐఎస్ఎఫ్ కమాండర్ సుదేష్ జక్కర్, చందన్ కుమార్, రాజు, సర్వర్, సమత, సింగరేణి జీఎంలు లలిత్‌కుమార్, సుదర్శన్‌రావు, వెంకటయ్య, ఆర్ఎఫ్‌సీఎల్ అధికారి సోమనాథ్‌తో పాటు ఏసీపీలు, ఫైర్ ఆఫీసర్లు, సింగరేణి, ఎన్‌టీపీసీ అధికారులు పాల్గొన్నారు.

## ఎన్టీపీసీలో పటిష్ఠ బందోబస్తు




ఎన్టీపీసీ ప్లాంటు గేటు వద్ద సీఐఎస్ఎఫ్ బలగాల బందోబస్తు

జ్యోతినగర్, మే 8 (ఆంధ్రజ్యోతి): దేశ సరిహద్దులో నెలకొన్న ఉద్రిక్తతల నేపథ్యంలో ఎన్టీపీసీ ప్రాజెక్టుల్లో భద్రతను కట్టుదిట్టం చేశారు. దేశంలోనే కీలకమైన విద్యుత్ కేంద్రంగా గుర్తింపు పొందిన రామగుండం ఎన్టీపీసీ ప్రాజెక్టులో భద్రతా వ్యవస్థను పటిష్ఠం చేశారు. దక్షిణాదిలోని అన్ని రాష్ట్రాలకు ఈప్రాజెక్టు నుంచి విద్యుత్ సరఫరా జరుగుతోంది. దేశంలోని అన్ని కీలక ప్రాజెక్టులలో అలర్ట్ ప్రకటించిన క్రమంలో కేంద్రం రామగుండం ప్రాజెక్టులో భద్రతా వ్యవస్థను పెంచాలని ఆదేశాలు వచ్చినట్లు సమాచారం. సీఐఎస్ఎఫ్(సెంట్రల్ ఇండస్ట్రియల్ సెక్యూరిటీ ఫోర్స్) కేంద్రం ఆదేశాలతో అప్రమత్తమైంది. రోజువారీ భద్రతను పెంచడంతోపాటు అన్ని ముందస్తు చర్యలు తీసుకుంటున్నారు. డ్రోన్ దాడుతోపాటు విపత్తు సంభవిస్తే ప్రతిస్పందనకు సంబంధించి మాక్ డ్రిల్స్ నిర్వహిస్తున్నది. ప్రాజెక్టుకున్న అన్ని గేట్ల వద్ద తనిఖీలు చేపడుతున్నారు. 24 గంట నిఘాలో భాగంగా పెట్రోలింగ్‌ను ముమ్మరం చేశారు. సీఐఎస్ఎఫ్‌కు చెందిన ఇంటెలిజెన్స్ బృందాలు ఈ ప్రాంతంలో వివిధ వనరుల నుంచి సమాచారాన్ని సేకరిస్తున్నారు. కేంద్ర, రాష్ట్ర నిఘా వ్యవస్థలతో సమన్వయం చేసుకుంటున్నారు.

## ఆయిల్ పామ్ సాగు విస్తరించాలి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ కోయ శ్రీహర్ష

పెద్దపల్లి, మే 8 (ఆంధ్రజ్యోతి): వచ్చే వానాకాలం, యాసంగి సీజన్‌లో జిల్లాలో 2,500 ఎకరాలకు ఆయిల్ పామ్ సాగును పెంచాలని కలెక్టర్ కోయ శ్రీహర్ష అన్నారు. గురువారం సమీకృత కలెక్టరేట్‌లో నిర్వహించిన సమీక్షా సమావేశంలో మాట్లాడుతూ 2025-26లో జిల్లాలో 2500 ఎకరాల ఆయిల్ పామ్ సాగు విస్తీర్ణ లక్ష్య సాధనకు కృషి చేయాలని సూచించారు. ఖరీఫ్ సీజన్‌కు 1500 ఎకరాల్లో సాగు పెంచాలన్నారు. ఆయిల్ పామ్ సాగు వల్ల కలిగే లాభాలు, ప్రభుత్వం అందించే సబ్సిడీ అంశాలపై విస్తృత ప్రచారం కల్పించాలన్నారు. ఆయిల్ పామ్ సాగు అవసరమైన మొక్కలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ఆసక్తి చూపుతున్న రైతుల నుంచి వెంటనే డ్రిప్, మొక్కల కోసం డీడీలు సేకరించాలన్నారు. నిర్దేశించిన లక్ష్యం ప్రకారం సాగు విస్తరించేందుకు పక్కా ప్రణాళిక 4 రోజులలో తయారు చేసి సమర్పించాలని కలెక్టర్ తెలిపారు. జిల్లా హార్టికల్చర్ అధికారి జగన్ మోహన్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## ఆస్తి పన్ను వసూళ్లలో రికార్డు

### ముగిసిన ఎర్లీబర్డ్ ఆఫర్

కోల్‌సిటీ, మే 8(ఆంధ్రజ్యోతి): ఆస్తి పన్ను వసూళ్లలో రామగుండం కార్పొరేషన్ రాష్ట్రంలోనే ప్రథమ స్థానంలో ఉందని కమిషనర్ అరుణశ్రీ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎర్లీ బర్డ్ ఆఫర్‌లో ఆస్తి పన్ను వసూలు చేయడంలో నగరపాలక సంస్థ ప్రథమ స్థానంలో నిలిచిందని, ప్రస్తుత ఆర్థిక సంవత్సరం 2025-26కు సంబంధించి ఆస్తి పన్ను చెల్లించి వారికి 5శాతం రాయితీ ప్రకటిస్తూ ప్రభుత్వం ఏప్రిల్ మొదటి వారంలో ఎర్లీబర్డ్ ఆఫర్ ప్రకటించిందని, ఆఫర్ గడువు ఏప్రిల్ 30న ముగిసినప్పటికీ ప్రజల అభ్యర్థ న మేరకు మే 7వరకు ప్రభుత్వం గడువు పొడిగించిందన్నారు. గడువు ముగిసే సమయానికి రామగుండం నగరపాలక సంస్థ 47.91శాతం పన్ను వసూలు సాధించి రాష్ట్రంలోనే కార్పొరేషన్‌లలో ప్రథమ స్థానం, 151మున్సిపాలిటీల్లో 4వ స్థానంలో నిలిచిందని, నగరపాలక సంస్థ పరిధిలో 51,033 ఆస్తి పన్ను అసెస్‌మెంట్లు ఉండగా, మొత్తం పన్ను డిమాండ్ రూ.19.14కోట్లు ఉందని, ఇందులో 13,915 పన్ను అసెస్‌మెంట్ల నుంచి రూ.9.7కోట్లు వసూలు అయ్యిందని చెప్పారు. నగర పాలక సంస్థ ప్రత్యేకాధికారి కోయ శ్రీహర్ష, సూచనల మేరకు ఎప్పటికప్పుడు పన్ను వసూళ్లపై పురోగతిని సమీక్షిస్తూ స్వల్ప వ్యవధిలోనే పన్ను వసూళ్లలో రామగుండం నగరపాలక సంస్థ ముందంజలో ఉందన్నారు. దీని కోసం కృషి చేసిన డిప్యూటీ కమిషనర్ వెంకటస్వామి, ఆర్ఓ అంజనేయులు, ఆర్ఐలు శంకర్‌రావు, ఖాజాతో పాటు బిల్ కలెక్టర్లను కమిషనర్ అభినందించారు.

## 20న జరిగే సమ్మెలో కార్మికులు పాల్గొనాలి

గోదావరిఖని, మే 8(ఆంధ్రజ్యోతి): ఈనెల 20న జరగనున్న సార్వత్రిక సమ్మెలో కార్మికులు పాల్గొని విజయవంతం చేయాలని కార్మిక సంఘాల జేఏసీ పిలుపునిచ్చింది. గురువారం వకీల్‌పల్లె గని ఆవరణలో జరిగిన గేట్‌మీటింగ్‌లో జేఏసీ నాయకులు మాట్లాడారు. దేశ వ్యాప్తంగా బొగ్గు గనులను అమ్మేందుకు కేంద్రం కుట్ర చేస్తున్నదని, సింగరేణిలో కొత్త గనులు రాకుండా అడ్డుకుంటున్నట్లు నాయకులు ఆరోపించారు. బొగ్గు గనులను కార్పొరేట్ కంపెనీలకు అప్పగించడమే లక్ష్యంగా కేంద్రం తీసుకునే నిర్ణయాన్ని సమ్మె విజయవంతం చేయడం ద్వారా నిరసన తెలపాలని పిలుపునిచ్చారు. గేట్ మీటింగ్‌లో హెచ్ఎంఎస్ అధ్యక్షుడు రియాజ్ అహ్మద్, ఐఎఫ్‌టీయూ అధ్యక్షుడు ఐ కృష్ణ, టీబీజీకేఎస్ కార్యదర్శి కుమార స్వామి, ఏఐఎఫ్‌టీయూ అధ్యక్షుడు రాములు, నాయకులు ఈ నరేష్, బీ అశోక్, రాయమల్లు, అజీమ్, రవీందర్ పాల్గొన్నారు.

## ఆస్పత్రి భవన నిర్మాణానికి భూమి పూజ



ఆస్పత్రి భవనానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే విజయరమణారావు

పెద్దపల్లిటౌన్, మే 8 (ఆంధ్రజ్యోతి): జిల్లా ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రిలో అన్ని రకాల మెరుగైన వైద్య సేవలు అందుతున్నాయని ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు అన్నారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రి ఆవరణలో పాత భవనం కూల్చి కొత్త భవన నిర్మాణ పనులకు గురువారం ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇటీవల సీఎం రేవంత్ రెడ్డి పెద్దపల్లి పర్యటనకు వచ్చిన సందర్భంగా రూ. 51 కోట్లతో జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిని 50 పడకల నుంచి 100 పడకలకు విస్తరించేందుకు పరిపాలనా అనుమతులు ఇచ్చారన్నారు. పెరుగుతున్న రోగులకు అన్ని రకాల వైద్య సేవలు ప్రభుత్వ ఆసుపత్రిలో అందేలా పాత భవనం కూల్చి అధునాతన భవన నిర్మాణాన్ని ఏడాదిలోగా పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటామన్నారు. పనుల నిర్మాణ అనుమతులు ఉన్న కాంట్రాక్టర్ ఏడాదిన్నర సమయం ఉన్నా ఏడాదిలోగా పూర్తి చేయాలని, అందుకు సహకరిస్తామన్నారు. ఆస్పత్రిలో పరీక్షలు, వివిధ రకాల ఆపరేషన్లు, డెలివరీలు తదితర వైద్య సేవలు అందిస్తాన్నామని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. మార్కెట్ ఛైర్‌పర్సన్ ఈర్ల స్వరూప, ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీధర్, వైద్యులు, కాంగ్రెస్ నాయకులు, అధికారులు, పట్టణ ప్రజలు పాల్గొన్నారు.

## తల్లిదండ్రులు లేని పిల్లలకు అండగా ఉంటాం



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీహర్ష

పెద్దపల్లి టౌన్, మే 8 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో తల్లిదండ్రులను కోల్పోయిన పిల్లలకు జిల్లా యంత్రాంగం అండగా ఉంటుందని కలెక్టర్ కోయ శ్రీహర్ష భరోసా ఇచ్చారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో తల్లిదండ్రులను కోల్పోయిన పిల్లలు, వారి సంరక్షకులతో స్త్రీశిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. పిల్లలు చదువుల్లో ముందుండాలని తెలిపారు. పిల్లలకు ఉన్న అన్ని సమస్య లను ప్రభుత్వం పరిష్కరిస్తుందని, నిత్యం ఐసిపిఎస్ సిబ్బంది వారికి అందుబాటులో ఉంటారని కలెక్టర్ తెలిపారు. పదో తరగతి, ఇంటర్ విద్యార్థులతో మాట్లాడి ఉన్నత చదువుల అవకాశాల గురించి కలెక్టర్ చర్చించారు. పిల్లల సంరక్షకులు వారిని సొంత బిడ్డలతో సమానంగా చూసుకోవాలని కలెక్టర్ కోరారు. పిల్లలు ఏదైనా సమస్య ఉంటే వెంటనే 1098 కి ఫోన్ చేస్తే సిబ్బంది వెంటనే స్పందిస్తారని తెలిపారు. జిల్లా సంక్షేమ అధికారి వేణుగోపాల్, జితేందర్, కనకరాజు, రజిత, అనిల్, తదితరులు పాల్గొన్నారు.

## వైభవంగా లక్ష్మీనృసింహస్వామి కల్యాణం



ధర్మారం, మే 8 (ఆంధ్రజ్యోతి): ఖిలావనపర్తి గ్రామంలో లక్ష్మీనృసింహస్వామి కల్యాణం వైభవంగా జరిగింది. స్వామి వారి కల్యాణం తిలకించేందుకు చుట్టు పక్క గ్రామాల నుంచి భక్తులు తరలివచ్చారు. ఆలయ ఛైర్మన్ పోలు దాసరి సంతోష్, ఈవో కొన్న కాంతారెడ్డి సౌకర్యాలు కల్పించారు. వేసవిని దృష్ట్యా ఆలయ పరిసర ప్రాంతం అంతా చలువ పందిళ్ల వేయించి, మంచి నీటి వసతి కల్పించారు. కల్యాణం అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. ఏఎంసీ ఛైర్మన్ లావుడ్య రూప్లానాయక్, వైస్ ఛైర్మన్ అరిగె లింగయ్య, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు గాగిరెడ్డి తిరుపతి రెడ్డి, మాజీ ఏఎంసీ ఛైర్మన్ కొత్త నర్సింహులు తదితరులు పాల్గొన్నారు.


**గోదావరిఖనిలో ఆపరేషన్ చబుత్ర**
- 60 మందికి కౌన్సెలింగ్
- బైక్‌లు, కారు సీజ్

8

**శిక్షణ శిబిరంతో నైపుణ్యం పెంపు**
- డీవైజీఎం పర్సనల్ కిరణ్‌కుమార్




ఉప్పట్లలో రైతులు ఏర్పాటు చేసుకున్న నీటి కుంట

### భూగర్భ జలాలు పెంచేందుకు

# నీటి కుంటల నిర్మాణం

**ఉపాధిహామీ పనుల్లో నిర్మాణంపై అధికారుల దృష్టి**

మంథనిరూరల్, మే 8 (ఆంధ్రజ్యోతి): వేసవిలో రైతులకు సాగునీటి కష్టాలు, పశువులకు దాహార్తిని తీర్చటానికి ఉపాధిహామీ పనుల్లో భాగంగా నీటి కుంటలు (ఫారంపాండ్స్) నిర్మాణం చేపట్టడానికి అధికారులు దృష్టి పెట్టారు. మండలంలోని 35 గ్రామ పంచాయతీల్లో నీటి కుంటల నిర్మాణాలు చేపట్టడానికి అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. రైతులకు, పశువులకు నీటి కష్టాలు తొలగిపోవడంతోపాటు గ్రామాల్లోని కూలీ లకు ఉపాధి అవకాశాలు మెరుగుపడనున్నాయి. మండలంలో 12,545 మందికి జాబు కార్డులు ఉండగా రోజు మండలంలో 6 వేల పై చిలుకు మంది ఉపాధిహామీ పనుల్లో పాల్గొంటు న్నారు. మండలంలోని 28 నీటి కుంట లు మంజూరు కాగా వాటి నిర్మాణాన్ని గ్రామ పంచాయతీల్లో చేపట్టారు. 20 మీటర్ల పొడవు, 20 మీటర్ల వెడల్పు, 3 మీటర్ల లోతుతో రైతుల పొలాలు, అటవీ ప్రాంతాల్లో వీటి నిర్మాణాన్ని ఉపాధిహామీ కూలీలు చేపడుతున్నారు. దీంతో వర్షాలు పడినప్పుడు నీరు నిల్వ ఉండటంతో రైతులకు ప్రయోజనం చేకూరుతుండగా కూలీలకు ఉపాధి లభించనుంది. నీటి కుంటల నిర్మాణానికి కూలీలకు 970 పని దినాలుగా నిర్ధారించారు. నీటి కుంటల నిర్మాణానికి రైతులు ముందుకు వస్తే వారికి సాగునీటి కష్టాలు తీరనున్నాయి. వేసవిలో చేపల పెంపకం కోసం ఫిష్‌పాండ్స్ నిర్మాణం కూడా చేపడుతున్నారు. మండలం 62 మంజూరు కాగా అర గుంట స్థలంలో చెరువుల పెంపకానికి కుంటల తవ్వకాన్ని ఈజీఎస్‌లో చేపడుతున్నట్లు అధికారులు తెలిపారు. నీటి కుంటల నిర్మాణం పై పల్లెల్లోని రైతులకు అవగాహన కల్పిస్తున్నట్లు అధికారులు పేర్కొన్నారు. నీటి ఎద్దడి సమయంలో రైతుల సాగు అవసరాలకు, పశువులకు దాహార్తి తీర్చుకోవటానికి ఉపయోగపడుతాయని, వీటిపై రైతులు ఆసక్తి చూపాలని అధికారులు కోరుతున్నారు.

## కల్వర్టును ఢీకొన్న కారు.. ఒకరి మృతి

- మరొకరికి తీవ్రగాయాలు

మానకొండూర్, మే 8 (ఆంధ్రజ్యోతి): కల్వర్టును ఓ కారు ఢీకొన్న ప్రమాదంలో ఓ వ్యక్తిమృతి చెందగా మరొకరికి తీవ్రగాయాలు అయ్యాయి. వివరాలు ఇలా ఉన్నాయి మండలంలోని పచ్చునూర్ గ్రామానికి చెందిన దాసారపు నర్సయ్య (66) అనే వ్యక్తి సింగరేణిలో రిటైర్డు అయి బెల్లంపల్లిలో నివాసం ఉంటున్నాడు. మానకొండూర్‌కు చెందిన కొండ్ర సంజీవ్ అనే వ్యక్తితో గురువారం నర్సయ్య కారులో పచ్చునూర్‌కు వెళ్లి మానకొండూర్‌కు తిరిగి వస్తున్నారు. అన్నారం గ్రామ శివారులో రోడ్డు పక్కన ఉన్న కల్వర్టుకు కారు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో నర్సయ్య అక్కడికక్కడే మృతి చెందగా సంజీవ్‌కు తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు 108కు సమాచారం అందించగా సిబ్బంది చేరుకొని క్షతగాత్రుడిని చికిత్స నిమిత్తం కరీంనగర్ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. స్థానిక పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కరీంనగర్ ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

## ఆగి ఉన్న లారీని ఢీకొన్న ఆర్టీసీ బస్సు

● ప్రయాణికులకు తప్పిన ప్రమాదం

శంకరపట్నం, మే 8 (ఆంధ్రజ్యోతి): శంకరపట్నం మండలం వంకాయగూడెం శివారలో కరీంనగర్-వరంగల్ జాతీయ రహదారిపై ఆగి ఉన్న లారీని ఆర్టీసీ బస్సు గురువారం ఢీట్టింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. సిరిసిల్ల డిపోనకు చెందిన ఆర్టీసీ బస్సు కరీంనగర్ వైపు నుంచి హుజూరాబాద్ వైపు 52మంది ప్రయాణికులతో వెళ్తుంది. ఈ క్రమంలో వంకాయగూడెం శివారులో ఆగి ఉన్న లారీని ఆర్టీసీ బస్సు ఢీ కొట్టింది. ఈ ఘనటలో ఆర్టీసీ బస్సు ముందు భాగం పాక్షికంగా దెబ్బతింది. బస్సులో ఉన్న ప్రయాణికులు సురక్షితంగా బయటపడ్డారు. సమాచారం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని ప్రమాద వివరాలు నమోదు చేసుకున్నారు.

## మద్యం మత్తులో వరదకాలువలో పడి ఒకరి మృతి

మల్యాల, మే 8 (ఆంధ్రజ్యోతి): మద్యం మత్తులో వరద కాలువలో పడి గుర్రం నాగమల్లు(49) అనే వ్యక్తి మృతి చెందినట్లు ఎస్సై నరేశ్‌కుమార్ తెలిపారు. మల్యాల మండలం సర్వాపూర్‌కు చెందిన గుర్రం నాగమల్లు కొంతకాలంగా కుటుంబసభ్యులతో కలిసి వేములవాడలో ఉంటున్నాడు. అనారోగ్యంతో బాధపడుతున్న నాగమల్లు ఇటీవల మద్యానికి బానిసయ్యాడు. ఇటీవల స్వగ్రామమైన సర్వాపూర్‌కు వచ్చిన నాగమల్లు మంగళవారం సైకిల్‌పై బయటకు వెళ్లి తిరిగి రాకపోవడంతో బంధువులు వెతికారు. గురువారం గ్రామ శివారులోని వరదకాలువలో నాగమల్లు మృతదేహాన్ని గమనించిన స్థానికులు కుటుంబసభ్యులకు సమాచారం అందించారు. మృతుడి భార్య లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

## చైన్‌స్నాచింగ్‌కు యత్నించిన ఐదుగురి అరెస్ట్

మల్యాల, మే 8 (ఆంధ్రజ్యోతి): కొండగట్టు ఘాట్‌రోడ్డుపై చైన్‌స్నాచింగ్‌కు యత్నించిన ఐదుగురు నిందితులను పట్టుకున్నట్లు మల్యాల ఎస్సై నరేశ్‌కుమార్ తెలిపారు. మల్లాపూర్ మండలం సాతారంకు చెందిన ఓర్సు వనజ అనే మహిళ సోమవారం కొండగట్టు అంజనేయస్వామిని దర్శించుకొని ఘాట్‌రోడ్డు మీదుగా తన కొడుకులతో దిగువ కొండగట్టుకు వస్తోంది. కారులో వచ్చిన ఇద్దరు గుర్తు తెలియని వ్యక్తులు వనజ మెడలో నుంచి పుస్తెలతాడు అపహరణకు యత్నించగా ఆమె కిందపడిపోవడంతో నిందితులు కారులో పారిపోయారు. ఈ సంఘటనపై బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో సీఐ నీలం రవి ఆదేశాల మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. మల్యాల బైపాస్ మార్గంలోని సింగిల్‌విండో కార్యాలయం వద్ద బుధవారం సాయంత్రం వాహనాలు తనిఖీ చేస్తుండగా కారులోని ఐదుగురు అనుమానస్పదంగా కనిపించారు. దీంతో విచారణ జరుపగా చైన్‌స్నాచింగ్ దొంగలుగా గుర్తించామని ఎస్సై తెలిపారు. వారంతా కరీంనగర్‌కు చెందిన వారు కాగా దొంగతనాలే ప్రవృత్తిగా మరో చోరీ చేయడానికి వెళ్తూ పట్టుబడినట్లు ఎస్సై తెలిపారు.

## బైక్ అదుపు తప్పి యువకుడి మృతి

చొప్పదండి, మే 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆర్నకొండ శివారులో బైక్ అదుపు తప్పి కిందపడి యువకుడు మృతి చెందాడు. ఎస్ఐ సురేందర్ కథనం మేరకు ధర్మారం మండలం కటికనపల్లి గ్రామానికి చెందిన కట్ట నవీన్(32) మరో ఇద్దరితో బైక్‌పై కరీంనగర్‌కు వెళ్లి తిరిగి వస్తున్నారు. ఈక్రమంలో ఆర్నకొండ శివారులో బుధవారం అర్ధరాత్రి తర్వాత బైక్ అదుపు తప్పి కింద పడిపోయింది. నవీన్ తీవ్ర గాయాలతో అక్కడికక్కడే మృతిచెందగా, మిగతా ఇద్దరికీ గాయాలైనట్లు ఎస్ఐ సురేందర్ తెలిపారు.


## బైక్ అదుపుతప్పి వ్యక్తికి తీవ్ర గాయాలు

ఎల్లారెడ్డిపేట, మే 8 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట మండలం రాచర్ల గొల్లపల్లి గ్రామ శివారులోని కామారెడ్డి-సిరిసిల్ల ప్రధాన రహదారిపై గురువారం బైక్ అదుపుతప్పిన సంఘటనలో కామారెడ్డి జిల్లా బీబీపేట మండలం ఉప్పరపల్లి గ్రామానికి చెందిన వ్యక్తి అర్జున్‌కు తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రుడిని 108 వాహనంలో మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అర్జున్ తన ద్విచక్ర వాహనంపై గొల్లపల్లిలోని వివాహ వేడుకలకు హాజరై తిరిగి వెళుతున్న క్రమంలో ప్రమాదానికి గురయ్యాడు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నామని పోలీసులు తెలిపారు.



# పరీక్ష..ప్రశ్నార్థకం

● 'శాతవాహన'లో గందరగోళ పరిస్థితి
● ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు విడుదల చేయకపోతే పరీక్షలు నిర్వహించలేమని తేల్చిచెప్పిన ప్రైవేట్ కళాశాలల యాజమాన్యాలు
● గడువు ముగిసినా పరీక్ష ఫీజులు చెల్లించని వైనం
● ఆందోళనలో డిగ్రీ విద్యార్థులు



గణేశ్‌నగర్, మే 8 (ఆంధ్రజ్యోతి): ఫీజు రీయింబర్స్‌మెంట్, ఉపకార వేతనాల బకాయిలు ప్రభుత్వం మూడేళ్లుగా విడుదల చేయలేదు. డిగ్రీ పరీక్షలు నిర్వహించలేమని ప్రైవేటు కళాశాలల యాజమాన్యాలు చేతులెత్తేస్తున్నాయి. దీంతో శాతవాహన విశ్వవిద్యాలయ పరిధిలో డిగ్రీ సెమిస్టర్ పరీక్షల నిర్వహణ ప్రశ్నార్థకంగా మారింది. ఈ నెల 14 నుంచి డిగ్రీ 2, 4, 6 సెమిస్టర్స్ పరీక్షలు ప్రారంభంకావాల్సి ఉంది. ప్రైవేటు కళాశాలలు చేతులెత్తేయడంతో వర్సిటీ అధికారులు మల్లగుల్లాలు పడుతున్నారు. విద్యా సంవత్సరం ముగింపు దశలో పరీక్షలను ఆకస్మికంగా వాయిదా వేయవలసిన పరిస్థితులు తలెత్తాయి. పరీక్షలు వాయిదా పడితే విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడతారు.

### ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 36 వేల మంది విద్యార్థులు

ఉమ్మడి జిల్లా పరిధిలో ప్రభుత్వ, ప్రైవేట్, ఎయిడెడ్ డిగ్రీ కళాశాలలు 84 ఉన్నాయి. వీటిలో 36 వేల మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. ప్రభుత్వం రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయకపోవడంతో ప్రైవేట్ కళాశాలలు పరీక్షలు నిర్వహించలేమని ప్రకటించాయి. ఫీజుబకాయిలను పరీక్షలకు ముడిపెట్టొద్దని వర్సిటీ అధికారులు కళాశాలల ప్రతినిధులకు నచ్చ చెబుతున్నా.. వారు వినడం లేదు.

### కష్టంగా కళాశాలల నిర్వహణ :

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా శాతవాహన విశ్వవిద్యాలయం పరిధిలో మొత్తం 84 డిగ్రీ కళాశాలు ఉన్నాయి. వాటి 15 ప్రభుత్వ కళాశాలలు, ఎనిమిది ట్రైబ్రల్, సోషల్, వెల్ఫేర్ కళాశాలలు ఉన్నాయి. రెండు ఎయిడెడ్, 59 ప్రైవేట్ డిగ్రీ కళాశాలలు ఉన్నాయి. వీటికి కోట్లలో ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు రావాల్సి ఉన్నాయి. దీంతో కళాశాలల నిర్వహణ, అధ్యాపకుల వేతనాలు, వర్సిటీకి చెల్లించాల్సిన గుర్తింపు ఫీజులు భారంగా మారాయని ప్రైవేటు కళాశాలల యాజమాన్యాలు వాపోతున్నాయి. ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లిస్తేనే పరీక్షలు నిర్వహిస్తామని డిగ్రీ కాలేజీల యాజమాన్యాలు చెబుతున్నాయి. దీంతో పరీక్షల నిర్వహణపై సందిగ్ధం నెలకొంది. ఇప్పటికే ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని డిగ్రీ పరీక్షలు పూర్తికాగా.. శాతవాహన పరిధిలో డిగ్రీ పరీక్షలపై ప్రతిష్టంభన నెలకొంది. డిగ్రీ చివరి సెమిస్టర్ విద్యార్థులు మాత్రం తాము పోటీపరీక్షలకు అనర్హులమవుతామని.. పరీక్షలు నిర్వహించాలనిలని కోరుతున్నారు.

### అయోమయ పరిస్థితి నెలకొంది

**చిక్కుల కిరణ్, విద్యార్థి సంఘం నాయకుడు**



శాతవాహన యూనివర్సిటీ పరిధిలో డిగ్రీ పరీక్షలు నిర్వహిస్తారో.. లేదో తెలియని పరిస్థితి నెలకొంది. ఉన్నత చదువులకు, ప్రవేశ పరీక్షలకు సన్నద్ధం కావాల్సిన సమయంలో విద్యార్థులు పరీక్షలు ఉంటాయో ఉండవో అనే అయోమయంలో పడిపోయారు. చదువులపై దృష్టి సారించలేకపోతున్నారు. వారి భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని పరీక్షలు వెంటనే నిర్వహించి విద్యార్థులకు న్యాయం చేయాలి.

### బకాయిలు ఇచ్చేంత వరకు పరీక్షలు నిర్వహించలేం

**ఎం వెంకటేశ్వరావు, సుప్మా ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు**



మూడు సంవత్సరాల బకాయిలు ప్రభుత్వం చెల్లించాల్సి ఉంది. ప్రభుత్వం బకాయిలు ఇచ్చేంత వరకు పరీక్షలు నిర్వహించలేమని వైస్ చాన్సలర్‌కు సుప్మా సభ్యులందరం కలిసి చెప్పాము. ప్రభుత్వం గతంలో చాలా సార్లు మాట ఇచ్చి మాట దాటవేసింది. ఐదు యూనివర్సిటీ పరిదిలో పరీక్షలు బహిష్కరించాము.

### బకాయిలను విడుదల చేయాలి

**కసిరెడ్డి మణికంఠరెడ్డి, ఏఐఎస్‌ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు**



ఫీజు బకాయిలు పేరుకుపోవడంతో రాష్ట్రంలో ఉస్మానియా మినహా మిగతా ఐదు యూనివర్సిటీల్లో డిగ్రీ 2, 4, 6 సెమిస్టర్ పరీక్షలు జరగడం లేదు. కళాశాల యాజమాన్యాలు పరీక్ష ఫీజులను యూనివర్సిటీలకు చెల్లించలేదు. దీంతో ప్రధానంగా మూడో సంవత్సరం విద్యార్థులు భారీగా నష్ట పోయే అవకాశం ఉంది. వారు సెమిస్టర్ పరీక్షలు రాసి పాసై పోటీ పరీక్షలు రాయడానికి, పీజీ సెట్ రాయడానికి ఇబ్బందులు ఎదుర్కొనే అవకాశం ఉంది. డిగ్రీ విద్యార్థుల్లో దాదాపు 80 శాతం ఫీజు రీయింబర్స్‌మెంట్ ఆధారపడి చదువుకునేవాళ్లే ఉన్నారు.

### ఉన్నత విద్యను నిర్లక్ష్యం చేయొద్దు..

**రాచమల్ల రాజు, బీసీ సంక్షేమ సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్**



గత ప్రభుత్వం ఉన్నత విద్యను నిర్లక్ష్యం చేసింది. ప్రస్తుత ప్రభుత్వమూ అదే దారిలో పయనిస్తోంది. విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు విడుదల చేయకపోవడంతో కళాశాలల యాజమాన్యాలు విద్యార్థుల నుంచి బలవంతంగా ఫీజులు వసూలు చేస్తున్నాయి. స్కాలర్‌షిప్‌లను విద్యా సంవత్సరం ప్రారంభంలోనే విడుదల చేయాలి.

## భార్య, అత్తామామల వేధింపులకు యువకుడి బలి

చొప్పదండి, మే 8 (ఆంధ్రజ్యోతి): భార్య, అత్తమామల వేధింపులు భరించలేక యువకుడు మరణించిన సంఘటన గురువారం చొప్పదండిలో జరిగింది. ఎస్ఐ సురేందర్ కథనం మేరకు పెద్దపల్లి జిల్లా ముత్తారం మండలం లక్కారం గ్రామానికి చెందిన ఉండాటి సతీష్(30)కు చొప్పదండికి చెందిన కళతో పదేళ్ల క్రితం వివాహం జరిగింది. వీరికి ఒక పాప, బాబు ఉన్నాడు. పెళ్లి నాటి నుంచి సతీష్ అత్తగారింట్లో ఉంటుండగా అత్త మానుపాటి రాజవ్వ, మామ మానుపాటి కనుకయ్య, భార్య కళతో పాటు మరదలు వేధింపులు భరించలేక గురువారం ఇంట్లో ఉరివేసుకుని మృతిచెందినట్లు ఎస్ఐ సురేందర్ తెలిపారు. మృతుడు సతీష్ తండ్రి సాయిలు ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

## పాత కక్షలతో ఒకరిపై కత్తితో దాడి



చికిత్స పొందుతున్న గంగారెడ్డి

కోరుట్ల రూరల్, మే 8 (ఆంధ్రజ్యోతి): కోరుట్ల రూరల్ మండలం జోగినిపల్లి గ్రామంలో పాత కక్షలతో గంగారెడ్డి అనే వ్యక్తిపై అదే గ్రామానికి చెందిన నవీన్ గురువారం కత్తితో దాడి చేశాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన నల్ల నవీన్, ముక్కెర గంగారెడ్డిలు ఇద్దరు బర్రెల కాపరులు. వీరి మధ్య గతంలో పాత కక్షలు ఉండేవి. గురు వారం ఉదయం గ్రామంలో ఓ హోటల్ వద్ద ముక్కర గంగారెడ్డి టీ తాగుతుండగా నవీన్ కత్తితో విచక్షణారహితంగా దాడి చేసినట్లు స్థానికులు తెలిపారు. గమనించిన చుట్టు పక్కల వారు వారించడంతో నవీన్ అక్కడి నుంచి పరారయ్యాడు. గంగారెడ్డిని జగిత్యాల ఏరియా ఆసుపత్రికి బంధువులు తరలించారు. గంగారెడ్డి కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కోరుట్ల పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

## కార్మికులకు కూలి నిర్ణయించాలి

- సీఐటీయూ ఆధ్వర్యంలో సిరిసిల్ల కలెక్టరేట్ ఎదుట కార్మికుల ధర్నా



సిరిసిల్ల కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న కార్మికులు

సిరిసిల్ల కలెక్టరేట్, మే 8 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం స్వశక్తి సంఘాల మహిళల కోసం అందించే చీరలను తయారుచేసే కార్మికులకు కూలి నిర్ణయించి సమస్యలను పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి కోడం రమణ డిమాండ్ చేశారు. సిరిసిల్ల పట్టణం బీవైనగర్‌లోని సీఐటీయూ అమృత్‌లాల్ శుక్లా కార్మిక భవనం నుంచి కలెక్టరేట్ వరకు కార్మికులు బైక్‌ర్యాలీ చేపట్టారు. కలెక్టరేట్ ప్రధాన ద్వారం ఎదుట గురువారం సీఐటీయూ ఆధ్వర్యంలో మరమగ్గాల, వార్పిన్, వైపని కార్మికులు తాము తయారు చేసే చీరలకు కూలి నిర్ణయించడంతోపాటు యజమానులపై చర్యలు తీసుకోవాలంటూ ధర్నా చేశారు. ఈ సందర్భంగా రమణ మాట్లాడుతూ ప్రభుత్వం ఉత్పత్తి చేయిస్తున్న మహిళా పొదుపు సంఘాల సభ్యులకు అందించే చీరలకు సంబంధించి మరమగ్గాల, వార్పిన్, వైపని అనుబంధరంగాల కార్మికులకు మెరుగైన వేతనం వచ్చే విధంగా కూలి పెంచాలని నెల రోజుల క్రితం సమ్మె చేసిన ఫలితంగా ప్రభుత్వం యాజమానులకు ఒక మీటర్‌కు అదనంగా రెండు రూపాయల ధర పెంచిందన్నారు.

కానీ యజమానులు మాత్రం కార్మికులకు కూలి పెంచి ఇవ్వడం లేదన్నారు. దీని వలన కార్మికులకు నష్టం జరుగుతుందన్నారు. కలెక్టర్ స్పందించి యజ మానులతో చర్యలు జరిపి కార్మికులకు కూలి నిర్ణయించే విధంగా చర్యలు తీసుకో వాలని కోరారు. కార్యక్రమంలో వార్పిన్ యూనియన్ అధ్యక్షుడు సిరిమల్లే సత్యం, ఉడుత రవి, మచ్చ వేణు, బూట్ల వెంకటేశ్వర్లు, ఐరేనీ ప్రవీణ్, అవదూత హరిదాసు, అడిచర్ల రాజు, శ్రీకాంత్, రమేష్, మధు, శంకర్, సదానందం, శ్రీనివాస్, రాజశేఖర్, సతీష్, నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

## ధాన్యం కొనుగోలు వేగవంతం చేయాలని రైతుల రాస్తారోకో



ఫాజుల్ నగర్‌లో రాస్తారోకో నిర్వహిస్తున్న రైతులు

వేములవాడ రూరల్, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలని గురువారం ఫాజులనగర్ గ్రామంలో రైతులు బీజేపీ నాయకులు రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అకాల వర్షాలు ఉన్న కారణంగా ధాన్యం కొనుగోలు వేగవంతం చేయాలన్నారు. కొనుగోలు కేంద్రంలో సరిపడా లారీలు లేనందున ధాన్యం కొనుగోలులో జాప్యం జరుగుతుందన్నారు. ప్రస్తుతం 20వ నంబర్ నడుస్తుందని 150 నెంబర్ వరకు లైన్ ఉందన్నారు. స్థానిక అధికారులు స్పందించి ధాన్యం కొనుగోలు వీలైనంత వేగవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో బీజేపీ గ్రామ శాఖ నాయకుడు చిందం కుమార్, పోగుల రాకేష్, పెద్దకుర్మ మల్లేశం, కొండవేని మోహన్, మునిందర్‌రెడ్డి, ఎగుర్ల రాజు, అంజయ్య, ఓదేలు, సాయిలు, రైతులు పాల్గొన్నారు.

## లక్నోలో నాబార్డు రెండు రోజుల జాతీయ సదస్సు

- ప్రారంభించిన నాఫ్స్‌కాబ్ చైర్మన్ కొండూరు రవీందర్‌రావు



జాతీయ సదస్సులో ప్రతినిధులతో నాఫ్స్‌కాబ్ చైర్మన్ కొండూరు రవీందర్‌రావు

కరీంనగర్, మే 8 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): అంతర్జాతీయ సహకార సంవత్సరంలో భాగంగా సహకార సంస్థల బలోపేతం కోసం నాబార్డు ఆధ్వర్యంలో ఉత్తరప్రదేశ్ రాష్ట్రం లక్నోలో నిర్వహిస్తున్న రెండు రోజుల జాతీయ సదస్సును గురువారం నాఫ్స్‌కాబ్ చైర్మన్, కేడీసీసీబీ చైర్మన్ కొండూరు రవీందర్‌రావు ప్రారంభించారు. సహకార సంస్థల్లో షేర్ సర్వీసెస్ ఎంటిటీ, సహకారంపై రెండు రోజుల జాతీయ సదస్సును నిర్వహించినున్నారు. ఈ సందర్భంగా నాఫ్స్కాబ్ చైర్మన్ కొండూరు రవీందర్‌రావు మాట్లాడుతూ సహకార బ్యాంకుల బలోపేతం కోసం అమిత్‌షా నాయకత్వంలో కేంద్ర సహకార మంత్రిత్వ శాఖ తీసుకున్న వివిధ లాభాలు, నష్టాలను చర్చించడానికి, తగిన చర్యల కోసం తీసుకున్న చొరవను స్వాగతించారు. కేంద్ర ప్రభుత్వ కార్యక్రమాలు దీర్ఘకాలంలో చిన్న సహకార బ్యాంకులకు ప్రయోజనం చేకూరుస్తాయని అన్నారు. ఈ సదస్సులో సహకార మంత్రిత్వశాఖ కార్యదర్శి ఆశిష్ కుమార్ బుటానీ, జాయింట్ సెక్రటరీ సిద్ధార్ జైన్, ఉత్తర ప్రదేశ్ రాష్ట్ర ఆర్‌సీఎస్ సౌరబ్ బాబు, నాబార్డు చైర్మన్ షాజీ కేవీ, నాబార్డు డీఎండీ గోవర్ధన్ రావత్, సహకార రంగంలోని ఐటీ, ఇతర విభాగాల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

### కేడీసీసీబీకి ఉత్తమ పనితీరు అవార్డు

కరీంనగర్, మే 8 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): కరీంనగర్ జిల్లా సహకార కేంద్ర బ్యాంకు (కేడీసీసీబీ) పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి మంత్రిత్వ శాఖ నుంచి స్వయం సహాయ బృందాల అనుసంధానంలో రాష్ట్రస్థాయి 'ఉత్తమ పనితీరు అవార్డు' లభించింది. గురువారం హైదరాబాద్‌లో రాష్ట్ర పంచాయతీరాజ్, ఆర్‌డబ్ల్యుఎస్ శాఖ మంత్రి సీతక్క చేతుల మీదుగా డీసీసీబీ సీఈవో ఎన్ సత్యనారాయణ అందుకున్నారు. స్వయం సహాయక సంఘాల జీవనోపాధిని మెరుగుపర్చడంలో నిరంతర రుణ సహాయాన్ని అందిచినందుకు కేడీసీసీబీకి ఈ అవార్డు లభించింది.




మంత్రి సీతక్క నుంచి అవార్డు అందుకుంటున్న కేడీసీసీబీ సీఈవో సత్యనారాయణ

## మైనార్టీ గురుకులాల సొసైటీ రీజనల్ కో-ఆర్డినేటర్‌కు డాక్టరేట్



కనపర్తి సురేష్

కరీంనగర్ టౌన్, మే 8 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్, పెద్దపల్లి జిల్లాల మైనార్టీ గురుకులాల సొసైటీ రీజనల్ కో-ఆర్డినేటర్ కనపర్తి సురేష్ డాక్టరేట్‌కు ఎంపికయ్యారు. అమితవ్ ఘోష్ ఎంపిక చేసిన నవలల్లో థీమాటిక్ స్టడీ అనే అంశంపై అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ మెలిస్సా హెల్ పర్యవేక్షణలో ఆంగ్ల సాహిత్యంలో సమర్పించిన పరిశోధనకు ఉస్మానియా విశ్వవిద్యాలయం డాక్టరేట్ ప్రకటించింది. కరీంనగర్ జిల్లాలోని చొప్పదండికి చెందిన సురేష్ డాక్టరేట్ లభించడంపై చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యంతో పాటు పలువురు ఆయనను అభినందించారు.

## ఇసుక డంపు స్వాధీనం

ఎండపల్లి, మే 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మారేడుపల్లి గ్రామంలో ఎనిమిది ఇసుక డంపులు ఉన్నాయనే సమాచారంతో గురువారం ఎండపల్లి ఆర్ఐ దొంత రాజేశ్వరి నిల్వ ఉంచిన ఇసుకను స్వాధీన పరుచుకున్నారు. ఎనిమిది ట్రాక్టర్ల ఇసుకను వేలం పాట నిర్వహించగా ఏడు వేలు రూపాయల ఆదాయం వచ్చినట్టు ఆర్ఐ రాజేశ్వరి తెలిపారు. ఇసుక అక్రమ రవాణా ఎవరు చేపట్టినా వాటిని సీజ్ చేసి కఠిన చర్యలు తీసుకుంటామని ఆర్ఐ హెచ్చరించారు.

## ప్రతీ పల్లెకు ఆర్టీసీ బస్సు సౌకర్యం : విప్



బస్సు వద్ద ప్రభుత్వ విప్ లక్ష్మణ్‌కుమార్, ప్రజలు

పెగడపల్లి, మే 8 (ఆంధ్రజ్యోతి): ప్రతి పల్లె కు ఆర్టీసీ బస్ సౌకర్యం కల్పించి, ప్రజల ప్రయాణ బాదలు తీర్చేందుకు కృషి చేస్తున్నట్లు ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ పేర్కొన్నారు. పెగడపల్లి మండలంలోని రామబద్రునిపల్లిలో గురువారం బస్ సర్వీస్‌ను కరీంనగర్ డిపో మేనేజర్ శ్రీనివాస్‌తో కలసి ప్రభుత్వ విప్ లక్ష్మణ్ కుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా లక్ష్మణ్‌కుమార్ మాట్లాడుతూ రామబద్రుని పల్లి, ల్యాగలమర్రి, ఎల్లాపూర్, కీచులాటపల్లి, రాజారాంపల్లి తదితర గ్రామాల ప్రజల వినతుల మేరకు బస్ సర్వీస్ సేవలను పునరుద్ధరించినట్లు తెలిపారు.

## చిరుతల భజనకు వండర్ బుక్ ఆఫ్ రికార్డ్స్





చిరుతల రామాయణాన్ని ప్రదర్శిస్తున్న కళాకారులు, జ్ఞాపికను ప్రదానం చేస్తున్న అతిథులు

కరీంనగర్ కల్చరల్, మే (ఆంధ్రజ్యోతి) 8 : ప్రాచీన గ్రామీణ కళారూపమైన చిరుతల భజనకు ప్రపంచ ప్రఖ్యాతి తీసుకరావాలనే ఉద్దేశ్యంతో కళాభారతిలో కరీంనగర్ ఫోక్ ఆర్ట్స్ అకాడమీ, కళారవళి సోషియో కల్చరల్ అసోసియేషన్, సల్వాజి ఈవెంట్స్ అండ్ కల్చరల్ ఆర్గనైజేషన్ సంయుక్త నిర్వహణలో 8 గంటల పాటు నిర్విరామ చిరుతల భజన చేశారు. ఉమ్మడి 10 జిల్లాలకు చెందిన 600 మంది కళాకారులు ప్రత్యేక వేషధారణలో చిరుతల మోతలతో, చక్కని పాటలతో, గజ్జెలు కట్టి ప్రత్యేక విన్యాసాలు చేస్తూ ప్రదర్శన ఇచ్చారు. రికార్డు నమోదుకు ప్రతినిధిగా వండర్ బుక్ ఆఫ్ రికార్డ్స్ ఇంటర్నేషనల్ ప్రతినిధి బింగి నరేందర్ హాజరయ్యారు. సాయంత్రం జరిగిన ముగింపు కార్యక్రమానికి అతిథులుగా హాజరైన సుడా చైర్మన్ కోమటి రెడ్డి నరేందర్‌రెడ్డి, పురుమల్ల శ్రీనివాస్, ఆర్‌డీవో సీహెచ్ మహేశ్వర్, మున్సిపల్ అడిషనల్ కమిషనర్ సువార్త ఈవెంట్ రికార్డులో నమోదైనట్లు ప్రకటించారు. నిర్వాహకులు జి కృపాదానం, డాక్టర్ విష్ణుదాసు గోపాలరావు, సల్వాజి ప్రవీణ్‌కు రికార్డు మెమెంటోలు, ప్రశంసాపత్రాలు అందజేశారు. కళాకారులకు పార్టిసిపేషన్ సర్టిఫికెట్లు, టీం లీడర్లకు పార్టిసిపేషన్ సర్టిఫికెట్స్, జ్ఞాపికలు అందజేశారు.

## పీజీ కళాశాలలో భవన నిర్మాణానికి భూమి పూజ



పనులకు భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్, పక్కన ఎస్‌యూ వీసీ ఉమేష్‌కుమార్

కోల్‌సిటీటౌన్, మే 8 (ఆంధ్రజ్యోతి): గోదావరిఖని యూనివర్సిటీ పీజీ కళాశాలలో సుమారు 10లక్ష రూపాయల వ్యయంతో ఎంబీఏ భవనం, 13లక్షల రూపాయలతో అంతర్గత సీసీ రోడ్డు నిర్మాణ పనులకు ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్, శాతవాహన యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ ఉమేష్‌కుమార్ గురువారం భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ మాట్లాడుతూ నియోజకవర్గంలో విద్యార్థులకు అవసరమయ్యే వివిధ రకాల మౌలిక సదుపాయాలను సమకూరుస్తున్నామని తెలిపారు. శాతవాహన యూనివర్సిటీ వైస్‌చాన్సలర్ ప్రొఫెసర్ ఉమేష్‌కుమార్ మాట్లాడుతూ అకాడమిక్ బ్లాక్‌తోపాటు అప్రోచ్ రోడ్డు నిర్మిస్తున్నామన్నారు. అనంతరం నూతనంగా ఏర్పాటు చేసిన డిజిటల్ క్లాస్ రూమ్‌ని ప్రారంభించారు. శాతవాహన యూనివర్సిటీ రిజిస్టర్ ప్రొఫెసర్ జాస్తి రవికుమార్, ఓఎస్‌డీ టూ వీసి డాక్టర్ హరికాంత్, పరీక్షల నియంత్రణ అధికారి డాక్టర్ సురే ష్‌కుమార్, శాతవాహన యూనివర్సిటీ చీఫ్ వార్డెన్ డాక్టర్ మనోహర్, ఇంజనీర్ ప్రకాస్‌రావు, సంతోష్‌కుమార్, శ్రీకాంత్, కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ రమాకాంత్, అధ్యాపకులు డాక్టర్ రమేష్‌రెడ్డి, డాక్టర్ రవి, డాక్టర్ ప్రసాద్, అజయ్‌కుమార్ విద్యార్థులు పాల్గొన్నారు.

## సరస్వతి పుష్కరాల ఏర్పాట్లపై ఆర్టీసీ ఈడీ సమీక్ష




అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న ఈడీ సోలమన్

భగత్‌నగర్, మే 8 (ఆంధ్రజ్యోతి): త్రివేణి సంగమం స్థానమైన కాళేశ్వరంలో (గోదావరి, ప్రాణహిత, సరస్వతి) సరస్వతి పుష్కరాల సందర్భంగా కాళేశ్వరంలో పనులను పరిశీలించి బస్సుల ఏర్పాట్లపై అధికారులతో ఆర్టీసీ జోన్ ఈడీ పగిడిమర్రి సోమలన్ సమీక్ష నిర్వహించారు. సరస్వతి పుష్క రాలకు కరీంనగర్ జోన్‌లోని వివిధ రీజియన్‌ల నుంచి నడిపే బస్సులకు సంబంధించి చేస్తున్న ఏర్పాటు పనులను పరిశీలించారు.ఈ కార్యక్రమంలో రీజినల్ మేనేజర్ బి రాజు, వరంగల్ రీజినల్ మేనేజర్ విజయభాను, డిప్యూటీ రీజినల్ మేనేజర్లు భానుకిరణ్, ఎస్ భూపతిరెడ్డి, భూపాలపల్లి డిపో మేనేజర్ ఇందిర, ఈడి కార్యదర్శి యుగంధర్‌రెడ్డి పాల్గొన్నారు.

● కరీంనగర్-వరంగల్ రూట్‌లో డీలక్స్ ప్రయాణికులకు పది శాతం రాయితీ కల్పిస్తున్నట్లు కరీంనగర్ రీజినల్ మేనేజర్ బి రాజు ఒక ప్రకటనలో తెలిపారు. కరీంనగర్-వరంగల్ రూట్‌లో డీలక్స్ బస్సులలో (డీజిల్, ఎలక్ట్రికల్) ప్రయాణ చార్జీలో పది శాతం రాయితీ ఉందన్నారు. ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## కొండస్వామి బ్రహ్మోత్సవాలు ప్రారంభం

మెట్‌పల్లి రూరల్, మే, 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జగ్గసాగర్ గ్రామ శివారులోని కొండపై వెలిసిన స్వయంభూ లక్ష్మీవేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు గురువారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈనెల 15వ తేదీ వరకు స్వామివారి బ్రహ్మోత్సవాలను నిర్వహించేందుకు ఆలయాభివృద్ధి కమిటీ, గ్రామస్థులు ఏర్పాట్లు చేశారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా బండలింగాపూర్ గ్రామంలోని వేణుగోపాలస్వామి ఆలయంలో ఉన్న ఉత్సవమూర్తులను ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన పల్లకిలో ఉంచి శోభాయాత్రగా జగ్గసాగర్ గ్రామంలోని కొండస్వామి ఆలయానికి తీసుకొచ్చారు. అనంతరం ఉత్సవమూర్తులను ఆలయంలో ఏర్పాటు చేసి పంచామృతాలతో అభిషేకాలు, అలంకరణ, అర్చనలు తదితర కార్యక్రమాలను పురోహితులు చేపట్టారు. ఈనెల 9న ఆలయంలో నిర్వహించే స్వామి వారి కల్యాణంలో అధిక సంఖ్యలో భక్తులు హాజరై దర్శించుకుని స్వామి వారి కృపకు పాత్రులు కావాలని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో ఆలయాభివృద్ధి కమిటీ, గ్రామస్థులు, భక్తులు, తదితరులు పాల్గొన్నారు.



స్వామి వారి శోభాయాత్ర నిర్వహిస్తున్న భక్తులు

# ఆన్‌లైన్‌లో రాజన్న సేవలు

- భక్తులు ముందే బుక్ చేసుకునే అవకాశం
- దూరప్రాంత భక్తులకు తప్పనున్న ఇబ్బందులు



వేములవాడ కల్చరల్, మే 8 (ఆంధ్రజ్యోతి): వేములవాడ రాజరాజేశ్వర స్వామివారి ఆలయంలో చేపట్టే సేవలను భక్తుల సౌకర్యార్థం ఆన్‌లైన్‌లోకి తీసుకువచ్చారు. నిత్యం రాష్ట్రంతో పాటుగా ఇతర రాష్ట్రాల నుంచి వచ్చే భక్తులతో రద్దీగా మారుతున్న సందర్భంగా భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ సేవలను ఆన్‌లైన్ చేశారు. రాజన్న ఆలయంలో నిత్యం నిర్వహించే పూజల వివరాలు తెలియక భక్తులు రాజన్నను దర్శించుకుని తిరిగి ప్రయాణమయ్యే వారు. అయితే రాజన్న ఆల యానికి వచ్చే భక్తులు ఎక్కడున్నా తమ ఫోన్‌లో ఆన్ లైన్ ద్వారా వారం రోజుల ముందే తాము చేయిం చుకునే పూజలను బుక్ చేసుకునే వెసులుబాటును అందుబాటులోకి తీసుకువచ్చారు. రాజన్న ఆలయంతో పాటుగా శ్రీనగరేశ్వర, బద్దిపోచమ్మ, శ్రీలక్ష్మీనర్సింహ స్వామి, శ్రీభీమేశ్వర స్వామి ఆలయాల్లో నిర్వహించే నిత్య, శాశ్వత పూజల వివరాలను ఆన్‌లైన్‌లో పొందు పరిచారు. భక్తులకు తమకు కావాల్సిన టికెట్లను వేములవాడ టెంపుల్.తెలంగాణ.గౌట్. ఇన్ అనే వెబ్ సైట్‌లో బుక్ చేసుకునేలా అందుబాటులోకి తీసుకవచ్చారు.

### ఆది, సోమవారాల్లో గర్భాలయ సేవలు రద్దు..

రాజన్న ఆలయానికి ప్రతి ఆది, సోమవారం రోజుల్లో భక్తుల రద్దీ అధికంగా ఉంటుంది. దీంతో ఆది, సోమవారాల్లో భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా గర్భగుడిలో నిర్వహించే పూజలను నిలిపివేశారు. అభిషేకం, అన్నపూజ, ఆకు పూజలను నిలిపివేసి మిగతా సేవలు కొనసాగిస్తారు.

రాజన్న ఆలయానికి వచ్చే భక్తులు స్వామివారికి శాశ్వత పూజలు చేసుకునేందుకు అవకాశం కల్పించారు. శాశ్వత పూజలు 10సంవత్సరాల వరకు వర్తిస్థాయి. ఏడాదిలో ఒక్కసారి మాత్రమే పూజలు చేయించుకునే వెసులుబాటు ఉంటుంది. శాశ్వత పూజల వివరాలు.. రుద్రాభిషేకం రూ.3000, మహాన్యాస పూర్వక రుద్రాభిషేకం రూ.1500, అన్నపూజ రూ.1000, శివకల్యాణం రూ.5000, మహాలింగార్చన రూ.3000, కుంకుమ పూజ రూ.1000, కోడెపూజ రూ.1000గా నిర్ణయించారు.

### వాహనాల పూజల వివరాలు..

లారీ, బస్సు, కారులకు రూ.400, ఆటో, టెంపో రూ.250, మోటార్‌సైకిల్ రూ. 100గా ఉన్నాయి. రాజన్న దర్శనం కోసం వెళ్లే భక్తులు శీఘ్ర దర్శనం టికెట్ ఒక్కరికి రూ.100, బ్రేక్‌దర్శనం ఒక్కరికి రూ.300 ధరలు ఉన్నాయి. రాజన్న ప్రసాదాల వివరాలు... లడ్డూ, బోగం రూ.700, సిరా బోగం రూ. 600, పులిహోర బోగం రూ. 200, దద్దోజనం రూ. 300, లడ్డూ ఒక్కటికి రూ. 20, అభిషేకం లడ్డూ రూ. 100, పులిహోర ఒక్కటి రూ.15.

### వసతి గదుల వివరాలు..

వేములవాడ రాజన్న ఆలయ పరిధిలోని ఆయా వసతి గదు ల్లోని రూముల ధరల వివరా లు.. భీమేశ్వర సదన్ గెస్ట్‌హౌస్ రూ.2800, భీమేశ్వర ఏసీ సూట్ రూ.1600, భీమేశ్వర సదన్ ఏసీ ఒక్క రూమ్ రూ.1344, నందీశ్వర ఏసీ సూట్ రూ.2800, నందీశ్వర ఏసీ రూమ్ రూ.1008, నందీశ్వర నాన్ ఏసీ రూమ్ రూ. 500, అమ్మ వారి అతిథిగృహం రూ.1600, పార్వతి పురం బ్లాక్‌లు రూ.672, పార్వతి పురం రూమ్ రూ.336, లక్ష్మగణపతి కాంప్లెక్స్ ఒక్క రూమ్ రూ.448.

### భక్తులకు ఇబ్బందులు తలెత్తకూడదనే ఆన్‌లైన్ సేవలు
**వినోద్‌రెడ్డి, రాజన్న ఆలయ ఈవో**



వేములవాడ శ్రీరాజరాజేశ్వర స్వామివారి ఆలయానికి నిత్యం వివిధ ప్రాంతాల నుంచి భక్తులు వేల సంఖ్యలో వస్తున్నారు. భక్తులకు రాజన్న ఆలయంలో నిర్వహించే పూజల వివరాలు తెలియాలనే ఉద్దేశ్యంతోనే ఆన్‌లైన్‌లో ఉంచాము. దూర ప్రాంతం నుంచి వచ్చే భక్తులు వారం రోజుల ముందే తమ ఫోన్ ద్వారా నిమిషాల్లో టికెట్స్, రూమ్‌లు బుక్ చేసుకునే అవకాశాన్ని కల్పించాము. రాజన్న ఆలయానికి వచ్చే భక్తులు ఆన్‌లైన్ సేవలను సద్వినియోగం చేసుకోవాలి.

### నిత్య పూజల వివరాలు..

రుద్రాభిషేకం (మహామండపం) రూ. 1000, కోడెమొక్కు రూ. 200, అభిషేకం (నాగిరెడ్డి మండపం) రూ. 500, అన్న పూజ రూ.500, అన్నపూజ గర్భగుడిలో రూ. 1000, ఆకు పూజ రూ. 1000, కుంకుమ పూజ రూ.300, శివకల్యాణం రూ. 1500, చండీ సహిత రుద్రహోమం రూ. 1516, మహాలింగా ర్చన రూ. 1000, పెద్ద సేవ రూ.350, పల్లకీ సేవ రూ. 200, సత్యనారాయణ వ్రతం రూ.600 కాగా, శ్రీభీమేశ్వరస్వామి ఆల యంలో పూజల వివరాలు శ్రీభీమేశ్వర అభిషేకం రూ. 516, నవగ్రహ పూజ రూ.516, ద్వాదశ జ్యోతిర్లింగాల అభిషేకం రూ.516గా ఆన్‌లైన్ చేశారు.




## కాల్షియం కార్బైడ్ నిల్వల గోదాంలో అధికారుల సోదాలు



సోదాలు చేస్తున్న పోలీసులు, ఫుడ్ సేఫ్టీ అధికారులు

జగిత్యాల, మే 8 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని తీన్‌ఖానీ చౌరస్తా సమీపంలో గల ఓ గోదాంలో నిబంధనలకు విరుద్ధంగా కాల్షియం కార్బైడ్ బాక్స్‌లను పెద్దఎత్తున నిల్వ చేశారన్న సమాచారంతో పోలీసులు, ఫుడ్ సేఫ్టీ అధికారులు గురువారం రాత్రి సోదాలు నిర్వహించారు. సదరు గోదాంలో సీలు గల బాక్సుల్లో ప్యాకెట్లు నిల్వచేయడాన్ని గుర్తించారు. సుమారు గంట పాటు పోలీసులు, ఫుడ్ సేఫ్టీ అధికారులు సోదాలు చేశారు. సహజసిద్ధంగా పండాల్సిన మామిడి, ఇతర పండ్లను కృతిమ పద్ధతిలో త్వరగా పండేలా నిర్దేశిత ప్రమాణాలకు మించి కాల్షియం కార్బైడ్ వినియోగంలో మగ్గబెట్టడానికి కొన్ని నిషేధిత కంపెనీలు, నాసిరకం కంపెనీలకు చెందినవి ఉన్నట్లు అనుమానించి పలు బాక్సులను పట్టుకున్నారు. కార్యక్రమంలో పట్టణ ఎస్ఐ కిరణ్ కుమార్, ఫుడ్ సేఫ్టీ అధికారి శేఖర్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

### మార్కులు తక్కువ వచ్చాయని విద్యార్థిని ఆత్మహత్య

జగిత్యాల అర్బన్, మే 8 (ఆంధ్రజ్యోతి): బీటెక్ మొదటి సంవత్సరంలో మార్కులు తక్కువ వచ్చాయని జగిత్యాల జిల్లా కేంద్రంలోని హౌసింగ్ బోర్డు కాలనీకి చెందిన కన్నవేణి సౌజన్యరెడ్డి అనే విద్యార్థి ఆత్యహత్యకు పాల్పడింది. జగిత్యాల సీఐ వేణుగోపాల్ తెలిపారు. రాయికల్ పట్టణానికి చెందిన కన్నవేణి మల్లారెడ్డి కూతురైన సౌజన్యరెడ్డి హైదరాబాద్‌లో బీటెక్ చదువుతోంది. గురువారం ఉదయం లేచి చూసేసరికి హాల్లో ఉరి వేసుకుని మృతిచెంది ఉంది. మృతురాలి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

# ధర్మపురిలో వైభవంగా చందనోత్సవం





యోగా నరసింహ స్వామి వారలను చందనంతో అలంకరణ చేసి హారతి ఇస్తున్న అర్చకుడు, స్వామి వారి పూజల్లో పాల్గొన్న భక్తులు

### - భారీగా దర్శనం చేసుకున్న భక్తులు

ధర్మపురి, మే 8 ( ఆంధ్రజ్యోతి ): ధర్మపురి క్షేత్రంలోని లక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో నరసింహ నవరాత్రోత్సవాల్లో భాగంగా గురువారం చందనోత్సవం కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. ఈ నెల మూడో తేదీ నుంచి ప్రారంభమైన నవరాత్రోత్సవాల్లో భాగంగా ఆరో రోజు ఉదయం ఆలయ వేదపండితులు బొజ్జ రమేష్‌శర్మ తదితర వేద బ్రాహ్మణుల మంత్రోచ్చరణల మధ్య ముఖ్య అర్చకులు నంబి శ్రీనివాసాచారి, అర్చకులు స్వామి వారలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. యోగ, ఉగ్ర నారసింహులను అందంగా చందనంతో అలంకరించారు. లోక కల్యాణార్థం సుదర్శన, నారసింహ, రుద్ర హోమాలు నిర్వహించారు.

గోదావరి నదిలో స్నానాలు చేసిన భక్తులు అధిక సంఖ్యలో స్వామి వారిని దర్శనం చేసుకున్నారు. అనంతరం భక్తులకు తీర్థ, ప్రసాద వితరణ చేశారు. ఆలయాలు నరసింహ నామస్మరణలతో ప్రతిధ్వనించాయి. కార్యక్రమంలో ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్, ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ జక్కు రవీందర్, టీసీసీసీ సభ్యులు, ధర్మపురి మండల అధ్యక్షుడు సంగనభట్ల దినేష్, ధర్మకర్తలు తదితరులు పాల్గొన్నారు.

### ● నరసింహుని సన్నిధిలో ప్రభుత్వ విప్ పూజలు

నరసింహ నవరాత్రోత్సవాలను పురస్కరించుకుని లక్ష్మీ నరసింహస్వామి ఆలయాన్ని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ గురువారం సందర్శించారు. అనంతరం ఆయన చందనోత్సవ కార్యక్రమంలో పాల్గొని స్వామి వారిని దర్శనం చేసుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ జక్కు రవీందర్, ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్ స్వామి శేష వస్త్రం కప్పి, ప్రసాదాలు అందించి సన్మానించారు.



ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్‌కు ప్రసాదం అందజేస్తున్న అధికారులు

## మానసాదేవి ఆలయంలో సప్తమ వార్షికోత్సవాలు ప్రారంభం



అమ్మవారికి పసుపుతో అభిషేకం చేస్తున్న వేద పండితులు

గన్నేరువరం, మే 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఖాసింపేట మానసాదేవి ఆలయ సప్తమ వార్షికోత్సవ వేడుకలు గురువారం ఘనంగా ప్రారంభం అయ్యాయి. ఈ వేడుకల్లో ఉదయం నుండి గణపతి హోమాలు, మానసాదేవి, అపురూపలక్ష్మి అమ్మవార్లకు 54 కిలోల పసుపు, కుంకుమలతో అభిషేకాలు ఆలయ ప్రధాన అర్చకుడు అమర్‌నాథ్‌శర్మ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. భక్తులకు అన్నదానం నిర్వహించారు.

### ‘శాతవాహన’ పరిధిలో 15 నుంచి బీఎస్సీ పరీక్షలు

గణేశ్‌నగర్, మే 8 (ఆంధ్రజ్యోతి): శాతవాహన విశ్వవిద్యాలయం పరిధిలో బీఎస్సీ ఆనర్స్ (4 సంవత్సరాల కోర్స్)లో రెండో, నాలుగో సెమిస్టర్ పరీక్షలు మే 15 నుంచి ప్రారంభమై మే 30కి ముగు స్తాయని, బీఎస్సీ ఆనర్స్‌లో రెండో, నాలుగో సెమిస్టర్ పరీక్షలు కంప్యూటర్ సైన్స్‌లో, రెండవ సెమిస్టర్ బయో మెడికల్ సైన్ స్‌లో జరగనున్నట్టు విశ్వవిద్యాలయ పరీక్షల నియంత్రణ అధికారి డా.డి.సురేష్ కుమార్ తెలిపారు. విద్యార్థులు పరీక్షలకు సన్నద్ధం కావాలని ఇతర వివరాలకు కళాశాలలో గాని, విశ్వవిద్యాలయ వెబ్‌సైట్‌ను సందర్శించాలని తెలిపారు.



# సెలవుల్లో ఉత్సాహంగా

● ‘స్వచ్ఛ’ హుజూరాబాద్‌లో భాగంగా వేసవి శిక్షణ శిబిరం ● మున్సిపాలిటీ ఆధ్వర్యంలో కార్యక్రమాలు



హుజూరాబాద్‌లో ఫుట్‌బాల్ ఆడుతున్న విద్యార్థులు

హుజూరాబాద్, మే 8 (ఆంధ్రజ్యోతి): హుజూరాబాద్ మున్సిపాలిటీ ఆధ్వర్యంలో ‘స్వచ్ఛ’ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు క్రీడా నైపుణ్యాలను మెరుగు పరిచేందుకు శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. స్వచ్ఛ హుజూరాబాద్ కార్యక్రమంలో భాగంగా హైస్కూల్ మైదానంలో ఉచిత వేసవి క్రీడా శిక్షణ శిబిరాన్ని జడ్జి ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి విశేష స్పందన లభించింది. ఉదయం, సాయంత్రం వేళల్లో విద్యార్థులు ఉత్సాహంగా ఆటల్లో పాల్గొంటున్నారు. ముఖ్యంగా కబడ్డీ, ఫుట్‌బాల్, వాలీబాల్, బాస్కెట్‌బాల్, క్యారం, చందరంగం, కరాటే, క్రికెట్, ఖోఖో, హాకీ తదితర ఆటల పోటీల్లో పీఈటీల ఆధ్వర్యంలో నేర్చుకుంటున్నారు. పిల్లలు ఖాళీగా ఉంటే సెల్‌ఫోన్, టీవీల వైపు మొగ్గు చూపకుండా ఉండేందుకు క్రీడలు అలవాటు చేస్తున్నారు. ఈ క్రీడాకారులకు డాక్టర్ నవీన్, న్యాయవాది ముక్కెర రాజు, సారయ్యలు టీషర్ట్స్, బిస్కెట్స్, పండ్లు, పాలు అందిస్తున్నారు. తల్లిదండ్రులు పిల్లల ఆటలను ప్రోత్సహిస్తుండడంతో ఉదయం సాయంత్రం వేళల్లో హైస్కూల్ మైదానం విద్యార్థులతో కిక్కిరిసిపోతోంది.

### విద్యార్థుల్లో నైపుణ్యం పెంచేందుకే క్రీడల్లో శిక్షణ
**సమ్మయ్య, మున్సిపల్ కమిషనర్, హుజూరాబాద్**



వేసవిలో విద్యార్థుల్లో నైపుణ్యాన్ని పెంచేందుకు స్వచ్ఛ హుజూరాబాద్‌లో భాగంగా క్రీడా పోటీలు నిర్వహిస్తున్నాం. రాష్ట్రంలో మొట్టమొదటి సారిగా మున్సిపల్ ఆధ్వర్యంలో క్రీడాకారులకు శిక్షణ ఇస్తున్నాం. విద్యార్థులు ఇంట్లో ఉంటే సెల్‌ఫోన్, టీవీలకు అలవాటు పడకుండా క్రీడలు దోహదపడుతాయి. పిల్లలను తల్లిదండ్రులు కూడా ప్రోత్సహిస్తున్నారు. ఖోఖో, హాకీ, వాలీబాల్, క్రికెట్, చందరంగం, క్యారం తదితర క్రీడల్లో విద్యార్థులు పాల్గొంటున్నారు. ఈ పిల్లలకు దాతలు ముందుకు వచ్చి పండ్లు, పాలు, బిస్కెట్స్ అందజేస్తుండటం అభినందనీయం.





క్యారం, చందరంగం ఆడుతున్న విద్యార్థులు

## సైలెన్సర్లు మార్చి ఇబ్బందులకు గురిచేస్తే చర్యలు
**- జగిత్యాల ఎస్పీ అశోక్ కుమార్**



సైలెన్సర్లను ధ్వంసం చేస్తున్న పోలీసులు

జగిత్యాల అర్బన్, మే 8 (ఆంధ్రజ్యోతి): సైలెన్సర్లు మార్చి ప్రజలకు ఇబ్బందులు కలిగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని జగిత్యాల ఎస్పీ అశోక్‌కుమార్ హెచ్చరించారు. అధిక శబ్దం కలిగించే 130 మాడిఫైడ్ సైలెన్సర్లను గురువారం ధ్వంసం చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ కొన్ని రోజులుగా స్పెషల్ డ్రైవ్‌లు నిర్వహిస్తు ద్విచక్ర వాహనదారులు సైలెన్సర్లను మాడిఫై చేసి అధిక శబ్దంతో ప్రజలకు ఇబ్బందుల కలుగజేస్తున్న 130 వాహనాలను స్వాధీనం చేసుకుని వాటి సైలెన్సర్‌ను ధ్వంసం చేసినట్టు వివరించారు. రోడ్డు ప్రమాదాలను నివారించేందుకు ట్రాఫిక్ నియమాలు పాటించి పోలీసులకు సహకరించాలని అన్నారు. శబ్ధ కాలుష్యాన్ని నిరోదించేందుకు చేపట్టిన ప్రత్యేక డ్రైవ్‌లో భాగంగా అధిక శబ్దం కలిగించే మాడిఫైడ్ సైలెన్సర్లను వినియోగిస్తున్న ద్విచక్ర వాహనాలపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మాడిఫై సైలెన్సర్‌లను వాడితే క్రిమినల్ కేసులు నమోదు చేయడంతో లైసెన్స్ రద్దు చేస్తామని ఎస్పీ హెచ్చరించారు. కా ర్యక్రమంలో డీఎస్పీ రఘు యందర్, టౌన్ ఇన్‌స్పెక్టర్ వేణుగోపాల్, ఐటీ కోర్ ఇన్‌స్పెక్టర్ రఫీక్‌ఖాన్, ట్రాఫిక్ ఎస్సై మల్లేష్ సిబ్బంది పాల్గొన్నారు.

## కొనుగోళ్లలో జాప్యం... పేరుకుపోతున్న ధాన్యం...

(5వ పేజీ తరువాయి)

ఇటు వడ్లు అమ్ముడుపోక, అటు వర్షాల భయంతో కంటిమీద కునుకు లేకుండా పోయింది. ఇట్లా ఎప్పుడు కాలేదు. వెంటనే అధికారులు లారీల సౌకర్యానికి కల్పించి ఆదుకోవాలె.

### సన్న వడ్లు కొనడంలో ఆలస్యం

**చింతల మురళి, రైతు జయ్యారం**



సన్న వడ్లకు ప్రభుత్వం బోనస్, మద్దతు ధర వస్తుందని ఆశతో అప్పు చేసి 5 ఎకరాల 10 గుంటల్లో సన్న రకం వడ్లను పండించా. 15 రోజుల నుంచి కొనుగోలు కోసం ఎదురు చూస్తున్నా. పగలు ఎండ, రాత్రి వీస్తున్న ఈదురుగాలులు, కారు మబ్బులతో దిగులు పడుతున్నా. ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం సన్న ధాన్యాన్ని త్వరగా కొనుగోలు చేయాలి.

### పొద్దంతా ఆరబెట్టుడే

**లింగగౌడ్, కౌలు రైతు గుడిపెల్లి**



ఐదు వందల క్వింటాళ్ల సన్న ధాన్యం పండించా. 10 రోజుల క్రితం కొనుగోలు కేంద్రానికి తీసుకువచ్చా. పగలు ఎండకు ధాన్యాన్ని ఆరా పోస్తున్న. రాత్రి పూట వీస్తున్న ఈదురుగాలులు, ఉరుములు, మెరుపులకు ఎప్పుడు వర్షం పడుతుందోననే ఆందోళన నెలకొంది. సన్న ధాన్యం కొనుగోలుకు మిల్లర్లు ముందుకు రావడం లేదని దీంతో జాప్యం జరుగుతుందని కేంద్రం నిర్వాహకులు అంటున్నారు. ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం కొనుగోళ్లు చేయాలి.

## తలసేమియాపై అవగాహన కల్పించాలి

సుభాష్‌నగర్, మే 8 (ఆంధ్రజ్యోతి): తలసేమియా వ్యాధిపై ప్రజలకు అవగాహన కల్పించాలని జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి డాక్టర్ సాజిద అన్నారు. అంతర్జాతీయ తలసేమియా దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ గురువారం నిర్వహించారు. తలసేమియా అనేది తల్లిదండ్రుల నుంచి పిల్లలకు సంక్రమించే రుగ్మత అని తెలిపారు. ఈ వ్యాధి గురించి ప్రజలకు తెలియచేయడం కోసం మే 8న తలసేమియా దినోత్సవాన్ని నిర్వహిస్తుంటారని అన్నారు.

# ప్రభుత్వ ఆసుపత్రిలో మెరుగైన వైద్య సేవలు

(ఆంధ్రజ్యోతి, పెద్దపల్లి)

జిల్లా కేంద్రంలో గల ప్రభుత్వ ఆసుపత్రిని వంద పడకల ఆసుపత్రిగా ప్రభుత్వం అప్‌గ్రేడ్ చేయడంతో పాటు నూతన భవన నిర్మాణానికి శ్రీకారం చుట్టింది. గడిచిన ఏడాది డిసెంబర్ 4వ తేదీన జిల్లా కేంద్రంలో జరిగిన సీఎం రేవంత్ రెడ్డి బహిరంగ సభకు ముందే పెద్దపల్లి ఆసుపత్రిని 50 పడకల నుంచి 100 పడకలకు అప్‌గ్రేడ్ చేయడంతోపాటు భవన నిర్మాణానికి 51 కోట్ల రూపాయలను మంజూరు చేశారు. అన్ని రకాల వసతులతో జీప్లస్ 3 తరహాలో భవన నిర్మాణానికి శ్రీకారం చుడుతున్నారు. నెల రోజులుగా పాత భవనాన్ని కూల్చివేత పనులు చేపట్టారు. పూర్తిగా నేలమట్టం చేసి చదును చేశారు. ఆక్సిజన్ ప్లాంటు గల భవనాన్ని కూడా కూల్చుతున్నారు. ఆక్సిజన్ ప్లాంటును తాత్కాలికంగా సుల్తానాబాద్ సివిల్ ఆసుపత్రికి తరలించనున్నారు. అయితే ప్రస్తుతం ఈ ప్లాంటు వినియోగంలో లేదు. నూతనంగా నిర్మిస్తున్న భవన నిర్మాణ పనులు ఏడాదిన్నరలో పూర్తి కావచ్చని చెబుతున్నారు.



చదును చేసిన పాత ఆసుపత్రి స్థలం

### పెరిగిన రోగులు

పెద్దపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి రోజు వివిధ మండలాల నుంచి 800 మంది వరకు రోగులు వస్తున్నారు. ఆసుపత్రి అప్‌గ్రేడ్ కాక ముందు 25 మంది డాక్టర్లు మాత్రమే ఉన్నారు. ప్రస్తుతం ఒక మానసిక వైద్యులు మినహా అన్ని రకాల డాక్టర్లు అందుబాటులో ఉన్నారు. 100 పడకల ఆసుపత్రిగా అప్‌గ్రేడ్ చేసినప్పటికీ, ఇంకా క్యాడర్ స్ట్రెంథ్ మంజూరు కాలేదు. కలెక్టర్ కోయ శ్రీహర్ష ప్రత్యేక చొరవ తీసుకుని జిల్లా ఆసుపత్రిలో అన్ని రకాల వ్యాధులకు చికిత్స అందించేందుకు వీలుగా ఔట్ సోర్సింగ్ ప్రాతిపదికన అదనంగా 25 మంది డాక్టర్లను నియమించారు. ప్రస్తుతం 50 మంది డాక్టర్లు, 65 మంది ఏఎన్ఎంలు, 8 మంది ల్యాబ్ టెక్నీషియన్లు, 8 మంది ఫార్మసిస్టులు, 83 మంది శానిటేషన్, పేషెంట్ కేర్, సెక్యూరిటీ సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారు. రోజుకు 800 మందికి పైగా ఓపీ సేవలు అందిస్తుండగా, నెలకు 200 మంది ప్రసవాలు జరుగుతుండగా, స్కానింగ్ సౌకర్యాన్ని కూడా కల్పించారు. ఆర్థోపెడిక్ ఆపరేషన్లు, జనరల్ ఆపరేషన్లు చేస్తున్నారు. దంత వైద్య సేవలు, కంటి ఆపరేషన్లు చేస్తున్నారు. గుండె సంబంధిత వ్యాధులను నిర్ధారించేందుకు 2డీ ఎకో, ఈసీజీ, ఆంజి యోగ్రామ్ పరీక్షలు నిర్వహిస్తున్నారు. గతంతో పోలిస్తే ప్రభుత్వ ఆసుపత్రిలో మెరుగైన వైద్య సేవలను అంది స్తున్నారని వివిధ ప్రాంతాల నుంచి వస్తున్న వారు చెబుతున్నారు.

జిల్లా ఆసుపత్రి భవన నిర్మాణం పూర్తయ్యే వరకు మాతా శిశు కేంద్రంలో తాత్కాలికంగా వైద్య సేవలను అందిస్తున్నారు. రోగులకు ఇదే భవనంలో వైద్య సేవలను అందిస్తు న్నారు.

# స్కిల్ డెవలప్‌మెంట్‌తోనే విద్యార్థులకు భవిష్యత్



మాట్లాడుతున్న జేఎన్టీయూ యూనివర్సిటి వైస్ చాన్సలర్

రామగిరి, మే 8(ఆంధ్రజ్యోతి): సాంకేతిక విద్యలో స్కిల్ డెవలప్‌మెంట్‌తోనే విద్యార్థులకు భవిష్యత్‌కు బాటాలు పడుతాయని జేఎన్టీయూ యూనివర్సిటీ వైస్ చాన్సలర్ కిషన్‌రెడ్డి అన్నారు. గురువారం రాత్రి జేఎన్టీయూ ఇంజనీరింగ్ కళాశాల(మంథని)లో నిర్వహించిన కళాశాల వార్షికోత్సవానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. మంత్రి శ్రీధర్‌బాబు చొరవతో యూనివర్సిటి టీసీఎల్‌తో ఒప్పందం చేసుకుందని పేర్కొన్నారు. కంప్యూటర్ పరిజ్ఞానం కల్గిన ప్రతీ విద్యార్థికి నైపుణ్యత శిక్షణ కల్పిస్తామని తెలిపారు. ఉద్యోగ అవకాశాలను కల్పించేందుకు కృషి చేస్తామని, అందుకు అనుగుణంగా ప్లేస్‌మెంట్స్ ఏర్పాటు చేస్తామని పేర్కొన్నారు. ఇంగ్లీష్‌పై మరింత నైపుణ్యం పెంచుకోవాలని విద్యార్థులకు తెలిపారు. అనంతరం ఇంజనీరింగ్‌లో టాపర్స్‌గా నిలిచిన విద్యార్థులకు గోల్డ్‌మోడల్స్ క్రీడాకారులకు బహుమతులను అందజేశారు. అనంతరం విద్యార్థులు చేసిన సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. రామగుండం ఏరియా క్వాలిటీ జీఎం బైద్య, ప్రిన్సిపాల్ విష్ణువర్ధన్, వైస్ ప్రిన్స్‌పాల్ ఉదయ్‌కుమార్, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.




ట్రినిటీ ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థుల నృత్య ప్రదర్శన

### ట్రినిటీ ఇంజనీరింగ్ కళాశాలలో వార్షికోత్సవం

పెద్దపల్లి కల్చరల్, (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు ఆధునిక సాంకేతికవైపు అడుగులు వేయాలని ట్రినిటీ ఎడ్యుకేషన్ ఇన్‌స్టిట్యూషన్స్ వ్యవస్థాపకులు, మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి అన్నారు. పెద్దపల్లిలో గురువారం ట్రినిటీ ఇంజనీరింగ్ కళాశాల వార్షికోత్సవానికి హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి మాట్లాడారు. ట్రినిటీ ఇంజనీరింగ్ కళాశాల 2008లో స్థాపించిన నాటినుండి ఎన్నో విజయాలు సాధిస్తూ కళాశాల న్యాక్ అక్రిడేషన్ పొందిందన్నారు. ప్రతి విద్యార్థి పట్టుదలతో చదివే విధంగా కృషిచేయాలని, నిరంతర తపనతో ముందుకు గాసాలని ఆయన పేర్కొన్నారు. బీటెక్ ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులను, క్రీడా పోటీలు నిర్వహించి గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. విద్యార్థులు చేసిన పలు సాంస్కృతిక నృత్యాలు ఆకర్షణగా నిలిచాయి. అకాడమిక్ డైరెక్టర్ డాక్టర్ అశోక్‌కుమార్, ప్రిన్సిపాల్ డాక్టర్ మణిగణేషన్, హెచ్ఓడీలు డాక్టర్ నటరాజ్, ప్రభాకర్, స్వాతి, హెచ్ఓడి పద్మిని, హెచ్ఓడి డాక్టర్ ఆరీఫ్, ఏవో సురేష్, రాజిరెడ్డి, చొప్పరి వంశీ, పలువురు ప్రొఫెసర్లు పాల్గొన్నారు.

## శిక్షణ శిబిరంతో క్రీడా నైపుణ్యం పెంపు

**డీవైజీఎం పర్సనల్ కిరణ్‌కుమార్**



ప్రాక్టీస్ నెట్‌ని ప్రారంభిస్తున్న డీవైజీఎం పర్సనల్ కిరణ్‌కుమార్

కోల్‌సిటీటౌన్, మే 8 (ఆంధ్రజ్యోతి): శిక్షణ శిబిరాలతో క్రీడల్లో నైపుణ్యాలు పెంపొందుతాయని సింగరేణి ఆర్‌జీ-1 డీవైజీఎం పర్సనల్ కిరణ్‌కుమార్ అన్నారు. హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్, కరీంనగర్ జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గోదావరిఖని జీఎం మైదానంలో నిర్వహిస్తున్న ఉచిత వేసవి క్రికెట్ శిక్షణ శిబిరంలో గురువారం క్రికెట్ ప్రాక్టీస్ నెట్స్‌ని ఆయన ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ క్రీడాకారులు ఇలాంటి శిక్షణ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. యువ క్రీడాకారులు మైదానాన్ని ఉపయోగించుకొని ఆరోగ్యాన్ని సంరక్షించుకోవడంతో పాటు క్రీడల్లో మరింత నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలన్నారు. సెల్‌ఫోన్లను వినియోగించి సమయం వృథా చేసుకోవద్దన్నారు. శిబిరం ఇంచార్జీ డి.కిరణ్‌కుమార్‌యాదవ్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో కరీంనగర్ జిల్లా క్రికెట్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు వి.ఆగంరావు, మురళీధర్‌రావు, సీనియర్ కోచ్ సుదేష్ కుమార్, జూనియర్ కోచ్ ఎం.శేఖర్, సీనియర్ క్రీడాకారులు ఎం.రవి, శ్రీనాథ్, ఎ.రాజ్‌కుమార్, అంజి, శ్రీకాంత్, సంతోష్ పాల్గొన్నారు.

### లారీని అడ్డుకున్న రైతులు



కనగర్తి లో సీడ్ లారీని అడ్డుకున్న రైతులు

ఓదెల, మే 8 (ఆంధ్రజ్యోతి): కనగర్తి గ్రామంలో రైతులు ఐటిసి కంపని సీడ్ ధాన్యం లారీని గురువారం అడ్డుకున్నారు. లారీ ముందే వంటావార్పు నిర్వహించి నిరసన వ్యక్తం చేశారు. రైతులు మాట్లాడుతు వానాకాలంలో 60 ఎకరాల్లో ఐటిసి కంపెనీకి చెందిన సీడ్ ధాన్యాన్ని సాగు చేయించారని తెలిపారు. 22 మందికి రూ.22 లక్షలు ఇవ్వగా మిగతా రూ.14 లక్షలు ఇవ్వ వలసి ఉందని తెలిపారు. కంపెనీ ఎండి ఇవ్వకపోవడంతో కనగర్తిలో సీడ్ ధాన్యంతో వెళుతున్న క్రమంలో రైతులు అడ్డుకొన్నారు. డబ్బులు ఇచ్చే వర కు లారీని వదిలిపెట్టమని భైఠాయించారు.

# గోదావరిఖనిలో ఆపరేషన్ చబుత్ర

**60మందికి కౌన్సెలింగ్**
**29బైక్‌లు, కారు సీజ్**

కోల్‌సిటీ, మే 8(ఆంధ్రజ్యోతి): గోదావరిఖని పట్టణంలో బుధవారం అర్ధరాత్రి వన్‌టౌన్ పోలీసులు ఆపరేషన్ చబుత్ర నిర్వహించారు. అర్ధరాత్రి రోడ్లపై తిరిగే జులాయిలు, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారే లక్ష్యంగా ముమ్మరంగా తనిఖీలు చేశారు. వన్‌టౌన్ సీఐ ఇంద్రసేనారెడ్డి, ట్రాఫిక్ సీఐ రాజేశ్వర్‌రావు ఆధ్వర్యంలో సివిల్, డిస్ట్రిక్ట్ గార్డ్ సిబ్బంది బైక్‌లపై పెట్రోలింగ్ చేస్తూ ప్రధాన కూడళ్లు, వీధులు, బహిరంగ ప్రదేశాలు, రోడ్లపై తిరుగుతున్న యువకులను, అనుమానస్పదంగా సంచరించే వారిని అదుపులోకి తీసుకున్నారు. పట్టణంలోని బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తున్న వారిని కూడా అదుపులోకి తీసుకున్నారు. 60మంది యువకులను అదుపులోకి తీసుకున్న పోలీసులు 29 బైక్‌లు, ఒక కారును సీజ్ చేశారు. డ్రంకెన్ డ్రైవ్ పరీక్షలు నిర్వహించారు. అనంతరం వారిని గోదావరిఖని వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌కు తీసుకువచ్చి కౌన్సెలింగ్ నిర్వహించారు. వన్‌టౌన్ సీఐ ఇంద్రసేనా రెడ్డి మాట్లాడుతూ రాత్రి 10గంటల తరువాత ఎవరైనా యువకులు గుంపులుగా రోడ్లపై కనబడినా, బైక్‌లతో విన్యాసాలు చేసినా చర్యలు తీసు కుంటామన్నారు. తల్లి దండ్రులు తమ పిల్లల పట్ల జాగ్రత్తలు తీసుకోవాలని, రాత్రి పూట అకారణంగా బయటకు వెళ్లకుండా కట్టడి చేయాలన్నారు. యువత ఎలాంటి చెడు మార్గాలకు వెళ్లకుండా తమ లక్ష్యాలను చేరు కోవాలన్నారు. గురువారం ఉదయం ఆపరే షన్ చబుత్రలో పట్టుబడిన యువకుల తల్లి దండ్రులను పిలిపించి మాట్లాడారు. అనం తరం కేసులు నమోదు చేసి వాహనాలను అప్పగించారు.



యువకులకు కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న సీఐ ఇంద్రసేనారెడ్డి

## ఘనంగా మంత్రి పొన్నం ప్రభాకర్ జన్మదినం



మంథని బస్టాండ్‌లో కేక్ కట్ చేస్తున్న నాయకులు

పెద్దపల్లి కల్చరల్, మే 8 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర సంక్షేమ శాఖ రోడ్డురవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ జన్మదిన వేడుకలు పెద్దపల్లి జిల్లా కాంగ్రెస్ పార్టీ పక్షాన గురువారం సాయంత్రం నిర్వహించారు. జెండా చౌరస్తాలో కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. ముఖ్య అతిథిగా టీ పీసీసీ ప్రచార కార్యదర్శి భూషనవేణి రమేష్‌గౌడ్, రాష్ట్ర మైనార్టీ కన్వీనర్ సయ్యద్ ఫయాజ్, మాజీ కోప్షన్ సభ్యుడు రహీముద్దీన్, మాజీ సర్పంచ్ సయ్యద్ సజాద్, సేవాదళ్ నాయకులు జావిద్, మాజీ ఎంపీటీసీ తిరుపతిగౌడ్, ఓబీసీ పట్టణ అధ్యక్షుడు బొడ్డుపల్లి సంపత్, దేవనంది సంతోష్, కార్యకర్తలు పాల్గొన్నారు.

**ఓదెల, (ఆంధ్రజ్యోతి):** కొలనూర్‌లో బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్ జన్మదిన వేడుకలను నిర్వహించారు. కేక్ కట్ చేసి ప్రభుత్వ ఆసుపత్రిలో పండ్లు, బ్రెడ్లు అలాగే గ్రామ కూడలిలో మహిళలకు స్వీట్లు పంపిణీ చేశారు. రాజయ్య గౌడ్, దొడ్డే స్వామి, పల్లె నవీన్, అఫ్జల్, దొడ్డే సదానందం, జీగురు రాజేందర్, జంగం సతీష్, కంది కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు.

**మంథని, (ఆంధ్రజ్యోతి):** స్థానిక ఆర్టీసి బస్టాండ్‌లో రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ పుట్టిన రోజు వేడుకలను ఆర్టీఏ మెంబర్ మంథని సురేష్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ప్రయాణికుల మధ్య కేక్ కట్ చేశారు. సమ్మయ్యగౌడ్, పొన్నం చంద్రయ్య గౌడ్, మోహన్‌గౌడ్, ఎండీ షఫీ, సతీష్, నవీన్, మంథని రామచంద్రం, సాయి, ఆర్టీసి సిబ్బంది పాల్గొన్నారు.

## స్నాతకోత్సవంలో జాతీయ జెండాతో..



మెడలో జాతీయ జెండాతో పట్టా అందుకుంటున్న అశ్రిత

కళ్యాణ్‌నగర్, మే 8(ఆంధ్రజ్యోతి): అమెరికా ఫ్లోరిడాలోని సెయింట్ లియో యూనివర్సిటీలో జరిగిన స్నాతకోత్సవంలో గోదావరిఖనికి చెందిన జ్యోతి ఫౌండేషన్ అధ్యక్షురాలు అశ్రిత్ భారతదేశ జాతీయ జెండాతో హాజరయ్యారు. మాస్టర్ ఇన్ డేటా ఎనలటిక్స్ బిజినెస్ అడ్మిషన్‌లో అశ్రిత పట్టా పొందారు. పట్టా తీసుకునేముందు జాతీయ జెండాను మెడలో వేసుకుని స్వీకరించారు. పట్టా పొందిన అశ్రిత్ గాంధీని పలువురు అభినందించారు.

# దేశ వ్యాప్త సమ్మెను విజయవంతం చేయండి



సమావేశంలో మాట్లాడుతున్న జాయింట్ యాక్షన్ నాయకులు

గోదావరిఖని, మే 8 (ఆంధ్రజ్యోతి): సింగరేణి పరిరక్షణకు ఈ నెల 20న జరిగే టోకెన్ సమ్మెను విజయవంతం చేయాలని సింగరేణి జాయింట్ యాక్షన్ నాయకులు పిలుపునిచ్చారు. గురువారం భాస్కర్‌రావుభవన్‌లో జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని, కేంద్ర ప్రభుత్వం సింగరేణి కొత్త గనులు కేటాయించాలని, కాంట్రాక్టు కార్మికులకు కనీస వేతనాలు అమలు చేయాలని తదితర డిమాండ్లపై యాజమాన్యానికి సమ్మె నోటీసు ఇచ్చామన్నారు. ఈనెల 20న జరిగే సమ్మెలో సింగరేణి కార్మికులు, కాంట్రాక్టు కార్మికులు పాల్గొనాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వ ప్రైవేట్ రంగ సంస్థల్లో పని చేస్తున్న సంఘటిత, అసంఘటిత కార్మికులకు తీవ్ర నష్టం చేసే చట్టాలను తీసుకువచ్చారని వారు ఆరోపించారు. దేశ వ్యాప్తంగా నిర్వహించే ఈ సమ్మెను విజయవంతం చేసి కేంద్ర ప్రభుత్వానికి బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. ఏఐటీయూసీ, ఐఎన్‌టీయూసీ, సీఐటీయూ, టీబీజీకేఎస్ సంఘాల నాయకులు కొరిమి రాజ్‌కుమార్, రాజేందర్, తుమ్మల రాజారెడ్డి, మాదాసు రామమూర్తి, ఎల్ ప్రకాష్, మడ్డి ఎల్లయ్య, వడ్డేపల్లి శంకర్, స్వామి, రవీందర్, మెండె శ్రీనివాస్, సారయ్య, తొడుపునూరి రమేష్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

### అండర్ గ్రౌండ్ అన్‌ఫిట్ కార్మికులకు వేతన భద్రత కల్పించాలి

గోదావరిఖని, మే 8(ఆంధ్రజ్యోతి): అండర్ గ్రౌండ్ అన్‌ఫిట్ కార్మికులకు డిసిగ్నేషన్, వేతనాల్లో మార్పు లేకుండా సర్ఫేస్‌లో సూటబుల్ జాబ్ ఇవ్వాలని సింగరేణి కోల్‌మైన్స్ కార్మిక సంఘ్ జనరల్ సెక్రెటరీ వై సారంగపాణి ప్రకటనలో డిమాండ్ చేశారు. అండర్ గ్రౌండ్‌లో పనిచేస్తూ గని ప్రమాదాలు, రోడ్డు ప్రమాదాలు, ఆక్యుపేషనల్ వ్యాధుల, ఇతర జబ్బుల బారిన పడిన కార్మికులు అండర్ గ్రౌండ్‌లో పనిచేయుటకు మెడికల్ బోర్డు అన్‌ఫిట్ చేసి, సర్ఫేస్‌లో వారికి అవకాశం కల్పిస్తున్నట్టు తెలిపారు. వారి హోదాను, వేతనాలను తగ్గించడం వలన కార్మికులు విధులకు గైర్హాజరు అవుతున్నారని, వేతనాలు సరిపోక ఆర్థిక ఇబ్బందులు పడుతున్నట్టు తెలిపారు. అండర్ గ్రౌండ్‌కు అన్‌ఫిట్ అయిన కార్మికులకు సర్ఫేస్‌లో వేతనాలు తగ్గించకుండా సూటబుల్ జాబ్ ఇచ్చేలా యాజమాన్యం చర్యలు తీసుకోవాలని సారంగపాణి ప్రకటనలో పేర్కొన్నారు.




### బీ గ్రేడ్ ఆపరేటర్ల ఎంపికకు ఇంటర్వ్యూలు

గోదావరిఖని, మే 8(ఆంధ్రజ్యోతి): ఆర్జీ-2 ఏరియా వకీల్‌పల్లె గనిలో ఎల్‌హెచ్‌డీ, ఎస్‌డీఎల్ యంత్రాలపై పనిచేసే ఆపరేటర్ల నుండి బీ గ్రేడ్ పదోన్నతి కోసం గురువారం అధికారులు ఇంటర్వ్యూలు నిర్వహించారు. సీ గ్రేడ్ నుండి బీ గ్రేడ్‌కు అర్హత గల్గిన ఉద్యోగులకు గని ఏజెంట్ కార్యాలయంలో జరిగిన ఇంటర్వ్యూకు అర్హత కలిగిన ఇద్దరు హాజరయ్యారు. గని ఏజెంట్ నెహ్రూ, ఏరియా ఇంజనీర్ నరసింహా రావు, డీజీఎం పర్సనల్ అనిల్‌కుమార్, అఫీషియేటింగ్ మేనేజర్ తిరుపతి, డీవైపీఎం శ్యాంప్రసాద్‌లు ఇంటర్వ్యూ నిర్వహించారు.

### మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం



మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న బీజేపీ నాయకులు

కాల్వశ్రీరాంపూర్, మే 8 (ఆంధ్రజ్యోతి): ప్రధాని నరేంద్రమోదీ ప్రభుత్వం ఆపరేషన్ సిందూర్ పేరుతో పాకిస్థాన్ ఉగ్రవాదులను హతమార్చడంపై మోదీ చిత్రపటానికి గురువారం బీజేపీ నాయకులు మండల కేంద్రంలో క్షీరాభిషేకం నిర్వహించారు. ఆపరేషన్ సిందూర్ పేరుతో మహిళా ఆర్మీ అధికారులు సోఫియాకురిషి, వ్యోమికసింగ్‌లతో ఆపరేషన్ సిందూర్ చేపట్టారు. దేశపౌరులు గర్వపడేలా చేసిన మోదీకి బీజేపీ ఆధ్వర్యంలో క్షీరాభిషేకం నిర్వహించారు. బీజేపీ మండల అధ్యక్షుడు చిలువేరు సంపత్‌కుమార్, జిల్లా కౌన్సిల్ మెంబర్ ఉప్పులకుమార్, నాయకులు గరుడే కిషన్, ఎలగందుల సంతోష్, సదానందం, గుల్బం రాజేష్, శంకర్, సాయి, పాల్గొన్నారు.

### క్రీడాకారులకు ఆర్థిక చేయూత

కాల్వశ్రీరాంపూర్, మే 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వెన్నంపల్లి గ్రామానికి చెందిన జిల్లా పరిషత్ హైస్కూల్ విద్యార్థులు కరాటే కిక్ బాక్సింగ్‌కు ఎంపికయ్యారు. వెల్తూరి నిహారిక, ఈర్ల శ్రీనితలకు మాజీ జడ్పీటీసీ వంగళ తిరుపతిరెడ్డి 4వేల రూపాయలు ఆర్థిక సాయం అందించారు. ఈనెల 23, 24, 25తేదీల్లో గోవాలో జరిగే అంతర్జాతీయ కరాటే కిక్‌బాక్సింగ్ ఫెడరేషన్ పోటీల్లో పాల్గొనేందుకు వీరికి జడ్పీటీసీ ఆర్థిక సహాయం అందించడంపై కుటుంబసభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. మాజీ ఉపసర్పంచ్ కరుణాకర్‌రావు పాల్గొన్నారు.

### తాగునీటి సమస్య లేకుండా చూడాలి



కార్యదర్శులతో మాట్లాడుతున్న డీపీవో వీరబుచ్చయ్య

కాల్వశ్రీరాంపూర్, మే 8 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో తాగునీటి సమస్య లేకుండా కార్యదర్శులు ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా పంచాయతీ అధికారి వీర బుచ్చయ్య అన్నారు. మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో గురువారం కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. డీపీఓ మాట్లాడుతూ గ్రామాల్లో పారిశుధ్య పనులు, ఇందిరమ్మ ఇండ్లు, ట్రేడ్ లైసెన్స్ రెన్యూవల్, అర్హులైన వారికి రాజీవ్ యువ వికాసం, వర్మి కంపోస్ట్ తయారీ, పీఎం విశ్వకర్మ, పొడిచెత్త అమ్మకం తదితర అంశాలపై సమావేశం నిర్వహించారు. ఎంపీడీవో పూర్ణచంద్రరావు, ఎంపీఓ ఎండి.ఆరీఫ్, కార్యదర్శులు పాల్గొన్నారు.

### క్యాన్సర్ బాధితుడికి నానేస్తం ఆర్థికసాయం

ఎలిగేడు, మే 8 (ఆంధ్రజ్యోతి): శివపల్లి గ్రామానికి చెందిన తాండ్ర భూమయ్య క్యాన్సర్‌తో బాధపడుతుండగా గురువారం నానేస్తం చారిటబుల్ ట్రస్ట్ నిర్వాహకులు తక్షణమే స్పందించి రూ. 6వేల ఆర్థిక సహాయం అందజేశారు. ఏడాదిన్నర కాలంగా భూమయ్య క్యాన్సర్‌తో బాధపడుతూ చికిత్స కోసం రూ.4లక్షల వరకు ఖర్చుచేసి అప్పుల పాలైనట్లు బాధిత కుటుంబ సభ్యులు తెలిపారు. భూమయ్యకు భార్య కౌసల్యతో పాటు ఇద్దరు కూతుర్లు ఉన్నారు. ప్రతీ నెల చికిత్స కోసం రూ.25వేల వరకు ఖర్చు అవుతుందని, ఆదుకోవాలని వేడుకుంటున్నారు. ట్రస్ట్ సభ్యులను భూమయ్య స్నేహితులు అభినందించారు. నానేస్తం సంస్థల చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ కట్ల సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శి వీరగోని లక్ష్మీనారాయణ, పెంట శ్రీనివాస్, బూర్ల వెంకటేశ్వర్లు, ఆసంపల్లి శంకర్, భూసారపు శ్రీనివాస్, కొత్తిరెడ్డి మల్లారెడ్డి ఉన్నారు.

### అంతర్జాతీయ కరాటే పోటీలకు హాసిని

మంథని, మే 8 (ఆంధ్రజ్యోతి): మలేషియాలో ఈనెల 9-12వ తేదీ వరకు జరిగే అంతర్జాతీయ కరాటే పోటీలకు మంథని జపాన్ షిటోరియో విద్యార్థి హాసిని ఎంపికైనట్లు కోచ్ కావేటి సమ్మయ్య గురువారం తెలిపారు. అంతర్జాతీయ కరాటే పోటీలకు హాసిని ఎంపిక కావడంపై జేఎస్ఎస్ ఇండియా అధ్యక్షుడు భరత్‌శర్మ, మహేష్, పాలకుర్తి పాపయ్య, సమ్మయ్య, రామస్వామి, రాకేష్‌లు హర్షం వ్యక్తం చేశారు.

### ఉచిత కుట్టు శిక్షణ కేంద్రం ప్రారంభం



కుట్టు మిషన్ శిక్షణ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఏపీఎం సంపత్

పెద్దపల్లి రూరల్, మే 8 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని గౌరెడ్డిపేటలో గురువారం గ్రామ స్వరాజ్య సంస్థ ఆధ్వర్యంలో ఉచిత కుట్టు మిషన్ శిక్షణ కేంద్రాన్ని ఐకేపి ఏపీఎం సంపత్ ప్రారంభించారు. ఈ సందర్భంగా పలువురు మహిళలకు సబ్సిడిపై కుట్టు మిషన్‌లను పంపిణీ చేశారు. సంపత్ మాట్లాడుతూ మహిళలు కుట్టు శిక్షణ పొంది ఉపాధి పొందడం ద్వారా ఆర్థికంగా ఎదగవచ్చన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. జిల్లా కోఆర్డినేటర్ ధనలక్ష్మీ, సీసీ సతీస్, సీఏ కవిత, రమ్య, శిక్షకురాలు లావణ్య, కార్యదర్శి తిరుపతి, హెచ్ఎం షమీఖాన్, వాలంటీర్లు పాల్గొన్నారు.

### శాంతి కోసం ప్రార్థనలు చేయాలి

మంథని, మే 8 (ఆంధ్రజ్యోతి): ఆపరేషన్ సిందూర్ నేపథ్యంలో దేశంలో శాంతి కోసం పాస్టర్లు ప్రత్యేక ప్రార్థనలు చేయాలని దైవ జనులు సలాడి శ్యాం కోరారు. స్థానిక సీయోను ప్రార్థన మందిరంలో గురువారం ఓపెన్ డోర్ మినిస్ట్రీస్ ఆధ్వర్యంలో జరిగిన పాస్టర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. దేశంలో ఉగ్రవాదం పేరిట అశాంతి నెలకొని యుద్ధం జరగకుండా ప్రత్యేక ప్రార్థనలు చేయాలన్నారు. ఐఎంఏ ప్రధాన కార్యదర్శి అంకరి కుమార్, పాస్టర్లు మహేష్, ప్రకాష్ పాల్, సామ్యూల్, రాకేష్, కోటేష్‌లు పాల్గొన్నారు.

### టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జీల నియామకం

మంథని, మే 8 (ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ సంస్థాగత నిర్మాణంలో భాగంగా గ్రామ, మండల, పట్టణ, డివిజన్‌కమిటీల ఏర్పాటుకు పార్లమెంట్ పరిధిలోని 8 అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఇన్‌చార్జీలను టీడీపీ అధిష్ఠానం నియమించింది. రామగుండం నియోజకవర్గ ఇన్‌చార్జిగా అందె భాస్కరాచారి, మంథని ఉప్పుల రామకృష్ణయ్య, మణిరాంసింగ్, పెద్దపల్లి నిమ్మకాయ ఏడుకొండలు, కోటగిరి పాపయ్య, ధర్మపురి అక్కపాక తిరుపతి, పెద్దపల్లి సత్యనారాయణలను నియమించారు.

### వాసవీ మాత జయంతి ఉత్సవాలు

మంథని, మే 8 (ఆంధ్రజ్యోతి): వాసవీ కన్యకా పరమేశ్వరీ మాత జయంతి ఉత్సవాలను ఆర్యవైశ్య సంఘం, ఆలయ కమిటీ, మహిళా సంఘం ఆధ్వర్యంలో అమ్మవారి ఆలయంలో విజయవంతమైనట్లు నిర్వాహకులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రత్యేక అలంకరణ, పూజలు నిర్వహించినట్లు తెలిపారు. ముఖ్య అతిథిగా జిల్లా అధ్యక్షుడు నల్మాసు ప్రభాకర్ హాజరు కాగా సంఘం నేతలు విజయ్‌కుమార్, రావికంటి మనోహర్, కొమురవెల్లి జయన్న, ఎల్లంకి వంశీ, కొత్త శ్రీనివాస్, నరేంద్రుల శేఖర్, కిరణ్, పాల్గొన్నారు.